

వైరాలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విపి గౌతమ్




# మనం ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్

శనివారం | 11 | మార్చి | 2023 | పేజీలు : 12




# ఇక ప్రజల్లోనే.. ప్రజలతోనే..

- దూకుడు పెంచనున్న బిఆర్ఎస్
- ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు కసరత్తు
- ఇప్పటికే వాడ వాడ పువ్వాడ పేరుతో ప్రజల ముంగిటకు మంత్రి అజయ్
- గృహలక్ష్మి, దళితబంధు, పోడు భూములకు పట్టాలుతో భారీగా లబ్ధి
- సంక్షేమ పథకాలకు ప్రచారం కల్పించాలని కేసీఆర్ ఆదేశం
- గ్రూపుల పోరుకు చెక్ పడేనా..?

**ఖమ్మం, మార్చి 10(మనం బ్యూరో) :** కేసీఆర్ ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో బిఆర్ఎస్ దూకుడు పెంచనుంది. నిత్యం ప్రజల్లోనే ఉండాలని కేసీఆర్ ఆదేశించడంతో ఆ మేరకు ఆయా నియోజకవర్గాల ఎంఎల్ఏలు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే వాడ వాడ పువ్వాడ అంటూ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం కార్పొరేషన్‌లోని పలు వార్డుల్లో పర్యటించారు. ఇదే విధంగా అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు ప్రారంభం కానున్నాయి.

జిల్లాలో బిఆర్ఎస్ బలంగా కనిపిస్తున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలకొచ్చేసరికి తడబడుతోంది. గ్రూపుల పోరే ఇందుకు కారణంగా తెలుస్తోంది. గతం కంటే గ్రూపుల పోరు ఇంకా పెరిగింది. ఈ నేపథ్యంలో నేతల మధ్య సమన్వయం పెంచడానికి అధిష్టానం చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో నాయకులకు, ప్రజాప్రతినిధులకు కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. నిత్యం ప్రజల్లోనే ఉండాలని, సంక్షేమ పథకాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయని క్లారిటీ ఇవ్వడంతో జనంలోకి వెళ్లే ప్రణాళిక రూపకల్పనకు ఎంఎల్ఏలు కసరత్తు ప్రారంభించారు.

**పువ్వాడ ముందంజ**

ఖమ్మం అసెంబ్లీలో మంత్రి పువ్వాడ ముందుగానే ప్రజల్లోకి వెళ్లారు. జనవరి 1న వాడ వాడ పువ్వాడ కార్యక్రమాన్ని మంత్రి అజయ్ ప్రారంభించారు. ఇప్పటికే పలు వార్డుల్లో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారాన్ని 2లో...



# అవిశ్రాంత శ్రామికుడు

## నిత్యం ప్రజల్లోనే...ప్రజలతోనే.. ప్రజల మదిని గెలుచుకుంటున్న సండ్ర

**సత్తుపల్లి టౌన్, మార్చి 10 (మనం న్యూస్):** పదుల సంఖ్యలో ప్రభుత్వ కార్యక్రమాలకు, ఇంకా ఎన్నో ఆత్మీయుల, అభిమానుల శుభ, అశుభ కార్యక్రమాలకు హాజరు అవుతూ, అనునిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటు ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటూ క్షణం తీరిక లేకుండా గడుపుతున్న ప్రజా ప్రతినిధులలో ఎంఎల్ఏ సండ్రవెంకటవీరయ్య ముందు వరుసలో ఉంటారు. ఎంత తీరిక లేకున్నా తనను నమ్ముకున్న వారికి ఏదో ఒక రూపంలో లబ్ధిచేకూర్చేందుకు రాత్రింబవళ్ల కష్టపడుతుంటారడానికి ఎన్నో ఉదాహరణలు 2లో...



# శీనన్న అభ్యర్థి గా ప్రజల్లోకి 'తెల్లం'

## 19 న భద్రాచలం లో ఆత్మీయ సమ్మేళనం



**భద్రాచలం, మార్చి 10(మనం ఏజెన్సీ ప్రతినిధి) :** బిఆర్ఎస్ తిరుగుబాటు నేత, మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరుడు తెల్లం వెంకట్రావు పరోక్షం గా తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. భద్రాచలం అసెంబ్లీ స్థానంలో తన తరపున అభ్యర్థిగా తెల్లం వెంకట్రావు ను ఇటీవల పొంగులేటి ప్రకటించారు. బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గాను, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ గాను బాధ్యతల్లో ఉన్న తెల్లం పొంగులేటి తోనే తన ప్రయాణం అంటూ ప్రచారం ప్రారంభించారు. రెండు నెలల క్రితం అనారోగ్యం గురైన ఆయన ఇపుడు కోలుకుని తనదైన శైలి లో తన అభిమానులను, అనుచరులను కలుస్తూ వచ్చే ఎన్నికల్లో తనకు అండగా ఉండాలంటూ 2లో...

# జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు కంటి వైద్య పరీక్షలు



**వైరా, మార్చి 10(మనం న్యూస్) :** మండల కేంద్రం రాజీవ్ విద్యా మిషన్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్య శిభిరాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోజు వారి నిర్వహిస్తున్న పరీక్షలు, అంది స్తున్న కళ్ళజోళ్ల వివరాలను, ప్రిస్కిప్షన్ కళ్ళజోళ్ళ ఇండెంట్లను పరిశీలించారు. కంటి వెలుగు కేంద్రానికి 506 కళ్ళ జోళ్లు వచ్చాయని, పరీక్షలు నిర్వహించి కళ్ళజోళ్లు పంపిణీ చేస్తున్నామని, అవసరమైన వారికి ప్రిస్కిప్షన్ కళ్ళజోళ్ళను ఇండెంట్ పెట్టామని వైద్యులు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.మాలతి, కంటి వెలుగు ఇంచార్జ్ శ్రీదర్, వైద్యులు ఉదయలక్ష్మి, మాదవి పాల్గొన్నారు.

# మన ఊరు– మన బడి పనుల పురోగతిని తనిఖీ చేసిన కలెక్టర్

## – విద్యార్థులతో కలిసి భోజనం



**వైరా, మార్చి 10 (మనం న్యూస్)** : మన ఊరు– మన బడి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ శుక్రవారం ఆకస్మిక తణిఖీ చేశారు. వైరా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, మండల ప్రాథమిక పాఠశాల, తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయం, బాలికల జూనియర్ కళాశాలల్లో రూ.65 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులు, అదనపు గదుల నిర్మాణం, కిచెన్ షెడ్, టాయిలెట్స్, ఫ్లోరింగ్, కాంపౌండ్వాలు, త్రాగునీరు, సంపు, వైరింగ్ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం కలెక్టర్ వైరా మండల కేంద్రంలో పర్యటించి పలు అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులు ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగశేషు, పంచాయితీ రాజ్ ఇఇ కెవికె. శ్రీనివాస్, వైరా మునిసిపల్ ఇంచార్జి కమీషనర్ అనిత, తహసీల్దార్ అరుణ, డి.ఇ. నవీన్, మండల ఎడ్యుకేషనల్ అధికారి వెంకటేశ్వర్లు ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# నానో యూరియాతో అధిక దిగుబడులు..

## – మండల వ్యవసాయ అధికారి బాలాజీ



**కొణిజర్ల, మార్చి 10 (మనం న్యూస్):** కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామంలో కొణిజర్ల మండల వ్యవసాయ అధికారి దొడ్డిగార్ల బాలాజీ నానో ద్రవ రూపం లో వున్న యూరియా ఉపయోగలను రైతులకు శుక్రవారం అవగాహనా కలిపించటం జరిగింది,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ యూరియా మాదిరిగానే ఈ ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా కూడా ఎక్కువ పని చేస్తుందని , రైతులు ములుగా వాడే యూరియా భూమిలో వేసిన వెంటనే నీటి ద్వారాకొంత, ఎండ వలన కొంత రైతులకు ఉపయోగం లేకుండా పోతుంది, కానీ ద్రావరూపంలో యూరియా వలన పంట పైన పిచకారి చేయటం వలన ఆకులమీద పిచకారి చేసిన యూరియా నేరుగా ఆకుల పత్ర రంధ్రాల ద్వారా నేరుగా ఆకుల లోపలకి వెళ్లి పంటకు నేరుగా పూర్తి స్థాయిలో ఉపయోగ పడుతుంది, కొంచం కూడా వృధా కాదు, ఆకుల లోపల వున్న యూరియా వాసరాలకు ఉపయోగ పడగా మిగిలిన యూరియా మొక్క కనజాలం లో నిలువా ఉంచుకుంటుంది, మళ్ళీ అవసరం వచ్చి నప్పుడు ఉపయోగించుకుంటుంది, అందుకని నేరుగా వాడే యూరియా కంటే నానో ద్రవరూపం లో వున్న యూరియా పిచకారి చేయటం వలన పంటకు నేరుగా ఉపయోగ పడటం వలన యూరియా వృధా తగ్గటం వలన కాకుండా దిగుబడులు పెరుగుతాయి.500 ఎంఎల్ ద్రవ రూపం లో వున్న నానో యూరియా 50 కేజీలు యూరియా బస్తా తో సమానం, పెద్ద గోపతి గ్రామం లో అనిమోలు శ్రీను వరిపొలం లో నానో ద్రవ రూపం లో యూరియా పిచకారి చేసి చూపించటం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏవో బాలాజీ, ఏఈఓ శ్రీనివాస్ రాజు, రైతుబందు అధ్యక్షులు పాటి వెంకటరావు, మరియు రైతులు పాల్గొన్నారు.

# కంటి వెలుగు కళ్ళజోళ్ల ప్రతి ఒక్కరికి అందాలి.....

## – జిల్లా కలెక్టర్ శశాంక



**మహబూబాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి):** స్క్రీనింగ్ చేసిన ప్రతి ఒక్కరికి కళ్ళ జోడ్లు తప్పనిసరిగా అందేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు.శుక్రవారం ఐ.డి.ఓ.సి.లోని కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో కంటి వెలుగు, కాన్పుల ప్రగతి , ఎనిమియా శాతం లపై వైద్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్ కు వివరిస్తూ.జిల్లాలో 34 రోజులలో 38 క్యాంప్ ల ద్వారా 185 గ్రామాలలో కంటి వెలుగు నిర్వహించడం జరిగిందని 32 గ్రామాలలో నిర్వహించడం జరుగుతున్నదని అదేవిధంగా మున్సిపాలిటీలలో 42 వార్డులలో కంటి వెలుగు పూర్తికాగా ఆరు వార్డులలో జరుగుతున్నది అన్నారు.2,17,700 మందికి స్క్రీనింగ్ చేసి 31138 రీడింగ్ గ్లాసెస్, 6,023 ప్రిస్క్రిప్షన్ గ్లాస్ లు అందించడం జరిగిందన్నారు. కంటి వెలుగు క్యాంప్ బృందంకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...స్క్రీనింగ్ చేసిన ప్రతి ఒక్కరికి కంటి వెలుగు కళ్ళ జోడ్లు అందాలన్నారు.మాతా శిశు అభివృద్ధికి వైద్యాధికారులు కృషిచేయాలన్నారు. కాన్పుల సంఖ్య మరింత పెరగాలని సి సెక్షన్ తగ్గించాలని, ఎనీమియా శాతాన్ని తగ్గించాలన్నారు. కాన్పుల సంఖ్య అధికంగా చేసిన వారిలో గంగారం కోమట్ల గూడెం తీగలవేణి కొత్తగూడ దంతాలపల్లి మండలాల పిహెచ్సి వైద్యులను కలెక్టర్ అభినందించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు సూర్యనారాయణ సుధాకర్ వైద్య శాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజు కంటి వెలుగు ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ అంబరీష ఉపవైద్యాధికారులు డాక్టర్ ఉమా గౌరీ మురళీధర్ కంటి వైద్య నిపుణులు సత్యనారాయణ పి ఎస్ సి డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇక ప్రజల్లోనే...

(మొదటి పేజీ తరువాయి)

చూపుతున్నారు. అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పంపిణీ పేరుతో లబ్ధిదారుల ఇండ్లకే వెళ్తున్నారు. ఇప్పుడు కేసీఆర్ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిత్యం సాగనుంది.

**చెక్కుల పంపిణీ పేరుతో ఎంఎల్ఏలు...**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ పేరుతో పలువురు ఎంఎల్ఏలు లబ్ధిదారుల వద్దకు వెళ్తున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోనైతే ఈ కార్యక్రమం పండుగ జాతరలా జరుగుతోంది. ఎంఎల్ఏ సండ్ర ప్రతి నిత్యం ఏదో ఒక పేరుతో జనంలోకి వెళ్తున్నారు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎంఎల్ఏలు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ పేరుతో ప్రజల వద్దకు వెళ్తున్నారు. ఇటీవల ఇల్లందు మున్సిపాలిటీలో ఎంఎల్ఏ హరిప్రియ వార్డుల పర్యటన చేస్తున్నారు. పాలేరు నియోజకవర్గంలో ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి ఆర్థిక సాయం పేరుతో జనంలోకి వెళ్తున్నారు. మొత్తంగా ఎంఎల్ఏలంతా ప్రజల్లోనే ఎక్కువ కాలం గడిపేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నారు.

**సంక్షేమ పథకాలపై ప్రచారం**

ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలని కేసీఆర్ ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో సంక్షేమ పథకాల వల్ల పొందుతున్న లబ్ధిని వివరించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే అమలవుతున్న పథకాల వల్ల ఎంత మంది లబ్ధి పొందారు, కొత్తగా వచ్చే పథకాల వల్ల ఇంకా ఎంత మందికి ప్రయోజనం చేకూరనుందనే విషయాలను వివరించేందుకు తగిన వ్యూహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా ప్రారంభమయ్యే యంత్ర లక్ష్మి పథకం వల్ల ఉమ్మడి జిల్లాలో 30 వేల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. దళితబంధు రెండో విడతపై గంపెడాశలు పెట్టుకున్న పరిస్థితి నెలకొంది. పోడు భూములకు హక్కుల కల్పన విషయలో రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్కువ మోతాదులో ప్రయోజనం పొందనుంది.

**గ్రూపుల పోరుకు చెక్ పడేనా...**

జిల్లా బిఆర్ఎస్‌లో గ్రూపుల గోలకు ఇకపైనైనా చెక్ పడేనా అని కార్యకర్తల్లో అంతర్మథనం ప్రారంభమైంది. ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం ద్వారా అందరినీ కలుపుకుపోయేందుకు ఆస్కారం ఉంటుంది. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో బిఆర్ఎస్ రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి ఉంది. ఇటీవల కాలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గ్రూపు బహిరంగంగానే బయటపడింది. ఇంకా పార్టీలోనే ఉంటూ గ్రూపు రాజకీయాలు చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. గెలిచిన వారు, ఓడిన వారంతా ఆ పార్టీలోనే ఉన్నారు. వీరంతా భవిష్యత్‌లో ఐక్యతారాగం ఆలపిస్తారా లేదా అనేది వేచి చూడాల్సిందే. పార్టీ నిర్ణయానికి భిన్నంగా నడిస్తే ఏ మేరకు చర్యలుంటాయి, ఆ ప్రభావం ఎంత వరకు పడనుందనే తదితర విషయలు భవిష్యత్‌లోనే తేలనున్నాయి.

# అవిశ్రాంత శ్రామికుడు..

**(మొదటి పేజీ తరువాయి)** చెప్పవచ్చు. పలు కారణాల చేత హాస్పిటల్స్ లో వైద్యం చేయించుకొని ఆర్థికంగా చితికిపోయామని, వైద్య ఖర్చులకు ఆదుకోండి అంటూ ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయానికి ఎన్నో దరఖాస్తులు వస్తుంటాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తూ ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం చేకూర్చాలనే తపనతో వచ్చిన ప్రతి దరఖాస్తును రాత్రి వేళల్లో తీరిక చేసుకుని పరిశీలిస్తుండడం సండ్ర పనితీరుకు నిదర్శనం. నిత్యం నియోజకవర్గంలో ప్రజలతో, ప్రజలలో ఉంటారు, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజ సమస్యలపై ప్రజలతో అధికారులను కలుస్తారు. ప్రభుత్వ సాయం కోరుతూ చేసుకున్న ప్రజలు దరఖాస్తులను రాష్ట్ర రాజధానికి వారే స్వయంగా వెళ్ళి ప్రభుత్వ కార్యాలయాలలో అందజేసి, మంజూరు చేయిస్తారు. మంజూరైన వాటిని తనే స్వయంగా లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి అందచేస్తుంటారు. ఇది ఎంఎల్ఏ సండ్ర దినచర్యగా చెప్పవచ్చు. అందుకే ఆయనను ప్రజలు ఇప్పటికి మూడు సార్లు గుండెల్లో పెట్టుకుని గెలిపించుకున్నారు. మరోసారి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారనడానికి అతిశయోక్తి లేదనేది జగమెరిగిన సత్యమని సత్తుపల్లి వాసులు చెబుతుండడం గమనార్హం.

# శీనన్న అభ్యర్థి గా

**(మొదటి పేజీ తరువాయి)** అభ్యర్థిస్తున్నారు. ఇందులో భాగం గా శనివారం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తో కలసి వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో తెల్లం వెంకట్రావు పర్యటించారు. ఈ నెల 19 న భద్రాచలం లో నిర్వహించనున్న పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆయా మండలాల్లోని బిఆర్ ఎస్ ముఖ్య నాయకులు తో పాటు, తనకు సన్నిహితం గా ఉన్న ఇతర పార్టీ ల నాయకులను కూడా తెల్లం కలిసి మద్దతు కోరినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు.

తెల్లం వెంకట్రావ్ 2018 ఎన్నికల్లో టిఆర్ ఎస్ అభ్యర్థి గా పోటీచేసి ఓడిపోయారు. 2014 లో వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి గా భద్రాచలం అసెంబ్లీ స్థానం లో పోటీకి సిద్ధమై చివరి నిమిషం లో పొంగులేటి కోరిక మేరకు పోటీ నుండి విరమించుకున్నారు. పొంగులేటి సీపీఎం మధ్య పొత్తు కుదరడం తో భద్రాచలం అసెంబ్లీ స్థానం లో సీపీఎం అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సి రావడం తో తెల్లం పోటీ నుండి తప్పుకోక తప్పని పరిస్థితి ఎదురైంది. అదే సమయం లో పొంగులేటి సూచన మేరకు మహబూబ్ బాద్ లోకసభ కు అయిష్టం గా పోటీ చేసిన తెల్లం ఓటమి పాలయ్యారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఉన్న తెల్లం ముందస్తుగానే ప్రజల్లోకి వెళుతున్నారు. తెల్లం వృత్తి రీత్యా వైద్యుడు కావడంతో వ్యక్తిగతం గా అన్ని పార్టీ ల నాయకులు, కార్యకర్తలతో మంచి సంబంధాలు ఉన్నాయి. వీళ్ళందరినీ కలుస్తూ ఈ ఒక్కసారి తనకు అండగా ఉండి గెలిపించాల్సిందిగా కోరుతున్నారు. ఈ పర్యటన లో తెల్లం వెంట రత్నం రమాకాంత్, రత్నం రజనీకాంత్, ఎండి నవాబ్, రాయపూడి ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, ఈడీ దాడులకు భయపడే పార్టీ కాదు

## – బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య

**కరకగూడెం, మార్చి 10 (మనం న్యూస్):** బిజెపి బెదిరింపులకు ఈ డి నోటీసులకు భయపడే పార్టీ కాదు మాది అవినీతిపై పోరాడే పార్టీ అని బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావల సోమయ్య అన్నారు.శుక్రవారం కరకగూడెం మండల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ నిలతొక్కుకోవటం కొరకు బీఆర్ఎస్ నాయకులపై అసత్యం ప్రచార చేస్తున్నారని,ఎన్ని కుట్రలు చేసిన తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పెట్టిందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ఇలాంటి వాటికి తాము భయపడబోమని,అన్యాయానికి, అవినీతికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతామని తెలిపారు. కేంద్ర అవినీతిపై నిరంతరం పోరాటం చేస్తామని తెలంగాణ పోరాటాల గడ్డ ఎవరికి తలవంచదు అని ఆయన అన్నారు.పెద్ద సంఖ్యలో వివిధ పార్టీ కార్యకర్తలు, నేతలు బీఆర్ఏస్ లో చేరేందుకు వస్తున్నారని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేగా కాళిక,భూర్గంపాడు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కొమరం రాంబాబు,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బుడగం రాము,కొంపెల్లి పెద్ద రామలింగం,రేగా సత్యనారాయణ,రావులకనకయ్య,ఆక్బర్ ఖాన్,బైరిశెట్టి చిరంజీవి,రావుల రవి,యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్ కుమార్,ఉప్పల రెడ్డి,ఊకే నరేష్,పులి శ్రీధర్,యాకుబ్ ఖాన్,చిట్టిమల్ల ప్రవీణ్,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఇఓ

**తిరుమలాయపాలెం, మార్చి 10 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం మండల విద్యాశాఖ అధికారి బాణాల వెంకట రామాచారి శుక్రవారం మండలంలోని ప్రాథమిక పాఠశాల బచ్చోడు హస్నాబాద్ మరియు ప్రాథమికోన్నత పాఠశాల మేడిదపల్లి పాఠశాలను సందర్శించి ఎఫ్ ఎల్ ఎన్ సామర్థ్యాల సాధనను, విద్యార్థుల అభివృద్ధిని పరిశీలించడం జరిగింది మరియు మన ఊరు మనబడి పనుల గురించి ప్రాథమికోన్నత పాఠశాల మేడిదపల్లి మరియు ప్రాథమిక పాఠశాల హస్నాబాద్ లలో హెడ్మాస్టర్ మరియు ఎస్ఎంసిల సమావేశం ఏర్పరిచి మన ఊరు మనబడి కింద ఏ ఏ పనులు అయితే ఉన్నాయో ఆ పనులు వెంటనే ముగించాలని సూచించారు.



# ముసలమ్మ తల్లి ఆలయంలో పాయం పూజలు

**కరకగూడెం, మార్చి 10 (మనం న్యూస్):** కరకగూడెం మండలం చొప్పల గ్రామంలో ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో ముసలమ్మ తల్లి జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమలు నిర్వహించిన పినపాక నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తల్లి దయవల్ల నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ తల్లిని వేడుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్త తోలెం చిన్న ముత్తయ్య,ఆలయ పూజారి తాటి లక్ష్మి ,యర్ర సురేష్,పూనెం శంకరయ్య,జలగం కృష్ణ,అరేం నర్సింహారావు,పడిగా సమ్మయ్య,గడ్డం రాజేష్,కరకపల్లి నాగేశ్వరరావు,ఏడుళ్ళ చంద్రయ్య,ఎల్లబోయిన సత్యం,తోలెం నర్సయ్య,అయ్యోరు ఆదినారాయణ,అయ్యేరు సారయ్య,సోలం రామకృష్ణ,రాజమల్ల నవీన్,జాడి శ్రీను,నిట్ట సత్యం,దెంచనాల రాజేందర్,అత్తె ముకుంద,ఎల్లబోయిన బుచ్చయ్య,గోగు విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.



# బుచ్చిరెడ్డిపాలెం యువకుడు గుండెపోటుతో మృతి

**మధిర, మార్చి 10 (మనం న్యూస్) :** మధిర మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన యువకుడు కొట్టే మురళీకృష్ణ (26) గుండెపోటుతో హైదరాబాదులో మృతి చెందారు. మృతుడు వ్యవసాయ కూలి కుటుంబానికి చెందిన కొట్టే కృష్ణ రాధా దంపతుల కుమారుడు హైదరాబాదులో ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగి. హైదరాబాదులో గురువారం సాయంత్రం సినిమా థియేటర్లో సినిమా చూస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో స్నేహితులు హుటాహుటిగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కొట్టే మురళి కృష్ణ మృతితో గ్రామంలో ,కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



# కలెక్టర్ గారు..గోడు వినండి

## బాధితుల ఆవేదన



**దమ్మపేట, మార్చి 10 (మనం న్యూస్) :** దమ్మపేట 58 59 జీవో లో సుమారు 250 మంది దరఖాస్తు చేసుకోగా దమ్మపేటలో 58 జీవో దరఖాస్తు పెట్టుకున్న వారిలో కనీసం 10% మంది కూడా పట్టాలు గాని డిమాండ్ నోటీసు గానీ రాలేదని డిమాండ్ నోటీసులు ప్రభుత్వ స్థలంలో సుమారు 100 120 గజాల లోపు ఇల్లు నిర్మించుకున్న నిరుపేదలకు ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పట్టాలిస్తానని చెప్పి ఈ రోజున దమ్మపేట లో 8 మందికి పట్టాలిచ్చి చేతులు దులుపుకుందని మిగిలిన 242 మందికి మరి ఎప్పుడు ఇస్తారని వాళ్ళ సంగతి ఏంటని బాధితులు కోరుతున్నారు డిమాండ్ నోటీసులు వచ్చినవారికి సుమారు లక్షన్నర రెండు లక్షల కట్టాలని ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం జరిగింది 120 గజాల్లోపు స్థలములో ఇల్లు నిర్మించుకుంటే మరి లక్షా రెండు లక్షలు మూడు లక్షల కట్టాలంటే ఏ విధంగా మేము కట్టగలమని పేద లు కలెక్టర్కి పత్రికా ముఖంగా తెలియజేసుకుంటున్నారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ మల్ల ఒక్కసారి తమరు తగు విచారణ జరిపి మేమందరం నిరుపేదలం మేము 120 గజాల్లోనే పాకలేసుకొని నివాసం ఉంటున్నాము మాకు కరెంటు బిల్లులు .పంచాయతీ మంచినీటి కలెక్షన్లు కూడా అమర్చుకొని మేం పన్నులు చెల్లిస్తున్నాము మరి ఈ రోజున లక్షా రెండు లక్షల కట్టమంటే మేము నిరుపేదలమైన వాళ్ళము ఎలా కట్టగలమని మా గోడు ఒక్కసారి మీరు విని మాకు న్యాయం చేయాలని తమరిని పత్రికాముఖంగా కోరుచున్నాము దాక మూడు కృష్ణవేణి ఈసర్ల దేవి ఊరుకొండ సుబ్బలక్ష్మి దధితుర్లు కలెక్టర్కి తెలియజేసినారు.

# గృహలక్ష్మి పథకానికి అర్హులుగా ప్రకటించాలి

## ఐఎఫ్టియు నాయకులు మంగీలాల్ విజ్ఞప్తి

**మణుగూరు, మార్చి 10 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన సొంత జాగా ఉన్నవారికి మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయం గృహలక్ష్మి సొంత ఇంటి పథకానికి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను కూడా అర్హులుగా ప్రకటించి లబ్ధిదారుల జాబితాలో చేర్చి వారికి చేయూతనివ్వాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐ ఎఫ్ టి యు)మణుగూరు ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు శుక్రవారం నాడు సింగరేణి రైల్వే కాంటాక్ట్ కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు గృహలక్ష్మి సొంత ఇంటి పథకాన్ని రాష్ట్ర క్యాబినెట్లో నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు అదేవిధంగా సింగరేణి వ్యాప్తంగా వివిధ గనులు డిపార్ట్మెంట్లలో పనిచేస్తున్న 90 శాతానికి పైగా కాంటాక్ట్ కార్మికులకు సొంత ఇల్లు లేదని చాలీ చాలని జీతాలతో జీవితాలను వెళ్ళదీస్తున్న వీరు సొంత ఇల్లు నిర్మించుకోవటం అనేది కలగాలని మిగిలిపోయిందని ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులను కూడా లబ్ధిదారులుగా ప్రకటిస్తే అప్పో సప్పో చేసి సొంత జాగా కొనుక్కుంటారని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే 3 లక్షల రూపాయల సొమ్ముతో సొంత ఇల్లు నిర్మించుకుంటారని ఇలాగైనా ఒక ఇంటి వారు అవుతారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులపై గృహలక్ష్మి పథకం ద్వారానైనా కనీస కనికరం చూపాలని ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ని కోరారు ఈ అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక గౌరవ శాసనసభ్యులు రేగా కాంతారావు ని కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ఒక వినతి పత్రాన్ని కూడా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కే గురుమూర్తి, వి శంకర్ నాయక్, జి నాగేశ్వరరావు, కే నాగేశ్వరరావు, ఎస్ కే రజబ్ అలీ, యు శివ రామకృష్ణ, కే నాగరాజు, శంకర్, శ్రీను, ఎం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.




# బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ఉప్పాక యువత

**పినపాక, మార్చి 10 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, సీతారాంపురం పంచాయతీ పరిధిలో గల పెంటన్నగూడెం గ్రామానికి చెందిన సల్లూరి జ్యోతి 30 క్యాన్సర్ తో బాధపడుతున్న సంగతి విధితమే .గతంలో పలుమార్లు పత్రికల్లో వచ్చిన కథనాలకు దాతలు స్పందిస్తూ తమకు తోచిన సహాయాన్ని చేయడం జరుగుతుంది. బాధితురాలికి భర్త ప్రసాద్, ఇద్దరు పిల్లలు పావని 12, శశి కుమార్ 10.వీరికి ఇంటిస్థలం లేదు,వుండటానికి ఇళ్ళు లేదు,పొరుగు ఇండ్లల్లో వుంటూ కూలి పనులకు వెళ్తూ పిల్లలను తిని తినక పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు.ఆరు నెలల క్రితం కడుపునొప్పి రావడంతో హాస్పిటల్ కి వెళ్తే గర్భాశయ క్యాన్సర్ నాల్గవ దశలో వుందని చెప్పారు. కనీసం మందుల ఖర్చు లకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నరని తెలిసి ఉప్పాక గ్రామానికి చెందిన యువత 6000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి మా అమ్మను బ్రతికించండి అంటూ వేడుకుంటున్న తీరు పలువురి ని కంటతడి పెట్టిస్తుంది. వైద్యానికి అయ్యే ఖర్చు భరించే స్తోమత లేకపోవడం కళ్ళముందు కన్నతల్లి అనారోగ్యంతో బాధపడుతుంటే ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆ కుటుంబం దాతల సహాయాన్ని కోరుతుంది.దాతలు ముందుకు వచ్చి సహాయం చేసి మా అమ్మను బ్రతికించవలసిందిగా కోరుతున్నారు. ఈ కార్యక్రమం లో కోడం రాము,కాలేవారి వెంకన్న, వెలదండి శ్రీహరి శ్యామల సతీష్, సిల్వేరు బాలకృష్ణ, గద్దల సాంబశివరావు వెబ్ ప్రవీణ్, బొగ్గుల వెంకటేష్ పాల్గొన్నారు.



# రైతుల సమస్యను పరిష్కరించాలి

## – రాష్ట్ర కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన

**ఎర్రుపాలెం, మార్చి 10 (మనం న్యూస్):** ఎర్రుపాలెం మండలం స్థానిక తాసిల్దార్ కార్యాలయం నందు శుక్రవారం కిసాన్ మోర్చా రాష్ట్ర సభ్యుడు నూతక్కి నరసింహారావు, అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుబంధు, లక్ష రూపాయల లోపు రుణమాఫీ ధరణి పోర్టల్ రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా అమలు చేయాలని తెలియజేశారు. 2024 ఎన్నికలలో బిజెపి తప్పకుండా అధికారంలోకి వస్తుందని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవన్నీ అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ కోటేశ్వరరావు, మొక్కపాటి శ్రీనివాసరావు, పాపట్ల రమేష్, స్వర్ణాకర్, పూపాళ్ళ చంద్రమౌళి, మిరియాల వెంకటేశ్వరరావు, పురం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# ‘ఈ ఆఫీస్’ విధానంలో ఫైల్స్ నిర్వహణ ఉండాలి

## – జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



**ఖమ్మం, మార్చి 10 (మనం బ్యూరో) :** సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో వివిధ శాఖల కార్యాలయాలను జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ శుక్రవారం ఆకస్మికంగా తణిఖీ చేశారు. వైద్య ఆరోగ్య, విద్యా, మైన్స్, మైనారిటీ సంక్షేమ, జిల్లా సంక్షేమ, జిల్లా పంచాయితీ అధికారి, పౌరసరఫరాల, కార్యాలయాల్లో ఉద్యోగుల వివరాలను పరిశీలించారు. ఉద్యోగులు సమయపాలన పాటించే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రతి కార్యాలయంలో ‘ఈ ఆఫీస్’ విధానంలో ఫైల్స్ నిర్వహణ ఉండాలని, భవన సముదాయంలో అన్ని శాఖల ఉద్యోగులు ఐ.డిఓసిలో ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్లో బోజనం చేయాలన్నారు. అనంతరం ఐ.డి.ఓ.సిలో ఏర్పాటు చేసిన క్రచ్చే పిల్లల సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. మహిళా ఉద్యోగుల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రచ్చే కేంద్రాన్ని సద్వినియోగ పర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. మహిళా ఉద్యోగులు విధుల నిర్వహణకు ఇబ్బంది కలగకుండా వారి చిన్న పిల్లలను సంరక్షణ కేంద్రం క్రచ్చేలో సంరక్షకులకు అప్పగించి నిశ్చింతగా తమ విదులను సమర్ధవంతంగా నిర్వర్తించాలన్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.శ్రీనివాసరావు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

## – బీజేపీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి



**మధిర, మార్చి 10 (మనం న్యూస్) :** బీజేపీ కిసాన్ మోర్చారాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతంగా సమస్యలపై దీక్షలు, నిరసన కార్యక్రమం లో బాగంగా మధిరలో స్థానిక తహసీల్దార్ మెమోరాండం ఇవ్వటం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ లక్ష రూపాయలు రుణమాఫీ వెంటనే వడ్డీతో సహా అమలు చెయ్యాలి,ధరణి పోర్టల్ లోపాలను వెంటనే సారి చెయ్యాలి,ప్రధాన మంత్రి పసల్ బీమయోజన తెలంగాణ లో అమలు చెయ్యాలి,ఉచిత కరెంట్ నిరంతరాయంగా రైతులకు అందించి పంటలు కాపాడాలని, ప్రధానమైన డిమేండ్స్ తో కూడిన మెమోరాండం ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమం లో బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్, ఏలూరి నాగేశ్వరావు, మధిర పట్టణ, మండల అధ్యక్షులు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ జిల్లానాయకులు,మర్శకట్ల స్వర్ణకర్, డివిఎన్ సోమేశ్వరావు, కొప్పురావూరి రామయోగేశ్వరావు ఓబీసీ మోర్చా అధ్యక్షులు, గరిడేపల్లి వేణు, యువమోర్చ అధ్యక్షులు, సంపసాల వెంకటనారాయణ, పింజారి ఖాజామియా, ఎస్కే జానీ,తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి సేవా సమితి చలివేంద్రం ప్రారంభం




**నేలకొండపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** భగవాన్ శ్రీ సత్యసాయి సేవ సమితి నేలకొండపల్లి వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కూసుమంచి రోడ్ లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎస్ఐ జి ఎస్ స్రవంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చి వేసవి తాపం నుండి ఉపశమనం పొందేందుకు సత్యసాయి సేవా సమితి వారు ప్రతి ఏటా చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. మానవసేవయే మాధవసేవ అన్నారు. ప్రతి వ్యక్తి తాను సంపాదించిన సొమ్ములో ఎంతోకొంత సామాజిక సేవా కార్యక్రమాలలో ఖర్చు చేయడం ద్వారా మానసిక సంతృప్తిని పొందవచ్చు అన్నారు. చలివేంద్రాన్ని నేలకొండపల్లి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సత్య సాయి సేవ కమిటీ జిల్లా అధ్యక్షుడు దమ్మాలపాటి సుధాకర్ రావు మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల కోసం సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సత్యసాయి ట్రస్ట్ కమిటీ సభ్యులు కొత్త రమేష్ సతీమణి కొత్త శారద పుట్టినరోజు సందర్భంగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రాయపూడి నవీన్, ట్రస్టు సభ్యులు గెల్లా జగన్మోహన్రావు, భాస్కర్ రావు, కొత్త రమేష్, దోసపాటి చంద్రశేఖర్, గెల్లా వెంకటరమణగుప్తా, కూచిపూడి శ్రీను, గెల్లా కృష్ణారావు, ఏటుకూరి రామారావు, కడియాల నరేష్, బల్లి వీరయ్య, అనుమల సత్యవతి, భాగ్యమ్మ, మల్లారపు మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అంకమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించిన రాయల నాగేశ్వరరావు



**నేలకొండపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** నేలకొండపల్లి మండలం చెరువు మాదారంలో అంకమ్మ తల్లి జాతర సందర్భంగా రాయల నాగేశ్వరరావు అంకమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాడ దుర్గాప్రసాద్ గ్రామ సర్పంచి ఈవూరి సుజాత .కొర్లగూడ ఎంపీటీసీ రేవూరి వాసవి. కాంగ్రెస్ నాయకులు ఆకుల శేఖర్ .వీరాంజనేయులు. ఎన్ వి సుందరయ్య మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే

**ఇల్లందు, మార్చి 10 (మనం న్యూస్) :** ఇల్లందు జగదాంబ గుంపులో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి నిర్వహించుకున్నారు. పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు భూక్యా శ్యామ్ అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్పా రాజేష్ మాట్లాడుతూసావిత్రిబాయి పూలే ఒక భారతీయ సంఘ సంస్కర్త ఉపాధ్యాయిని, రచయిత్రి అని మహిళలు నేటి సమాజంలో సమానమేనని కుల మత సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా నినదించిన నాయకురాలనీ బాల్యవివాహాలను, సతీసహగమనం అరికట్టాలని, దేశంలో మహిళలకు ప్రత్యేకమైన స్థానం ఉందని నిరూపించిన గొప్ప యోధురాలు. భారతదేశంలోనే మొట్టమొదటిఉపాధ్యాయురాలిగా రాణిస్తూ నిరక్షరాస్యులైన మహిళలను చైతన్యం చేయడంలో పాటుపడ్డారు, ఉపాధ్యాయ వృత్తినే కాకుండా మహిళలపై అనేక కార్యక్రమాలు నిర్వహించేదని వారు అన్నారు. ఆనాడే స్త్రీ సమానత్వం కై పోరాడిందని తాను చేస్తున్నటువంటి ఉద్యమాలలో జ్యోతిరావు పూలే వెన్నంటే ఉండి నడిపించే వారని, నూతన వ్యవస్థ కోసం ఆ దంపతులు నిరంతరం పోరాడారని తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మహిళల సాధికారతకు ఉద్యమించారని కొనియాడారు. తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా కొనసాగుతూ చదువు ప్రాధాన్యాన్ని వివరించిన గొప్ప సంఘసేవకురాలు సావిత్రిబాయి పూలే. మహిళల హక్కుల కోసం వందేళ్ల క్రితమే పోరాడిన తొలి తరం మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి. మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పులే భార్య. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు భావించారు. సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. వీరి బంధువులు నిజామాబాద్ జిల్లాలో బోధన్ నాందేడ్ కొండల్ వాడి



ప్రాంతంలో, ఆదిలాబాద్ చుట్టుపక్కల ఉన్నారు. బోధన్ ప్రాంతపు మున్నూరు కాపులు వీరికి చుట్టాలు. నిరక్షరాస్యురాలిగా ఉన్న ఆమెకు భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. ఆయన ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అహ్మద్ నగర్లో ఉపాధ్యాయ శిక్షణ పొంది 1848 మే 12న భర్తతో కలిసి కింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి బహుజన పాఠశాలను ప్రారంభించారు.కేవలం నాలుగేళ్లలోనే గ్రామీణ ప్రాంతాల్లో 27 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. తన జీవిత కాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. మానవ హక్కులు, ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారత కోసం ఈ సంస్థ కృషి చేసింది. 1873లో తన భర్త మహాత్మా పూలేతో కలసి సత్యశోధక్ సమాజ్ను ప్రారంభించి బాల్యవివాహలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలు కోసం బలమైన ఉద్యమం నడిపారు. తరువాత 1873 సెప్టెంబరు 24న ‘‘సత్యశోధక్ సమాజ్’’ అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యాన్ని శోధించడానికి ఉద్యమాన్ని నడిపారు పూలే. ఈ సత్యసోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభకార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది.1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాథ బాలలను దాదాపు 3,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించినారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే కాదు, రచయిత్రిగా కూడా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితా ‘కావ్యపూలే’ను ప్రచురించారు. మరో కవితా సంపుటి ‘పావన కాశీ సుభోధ్ రత్నాకర్’ను 1891లో ప్రచురించారు. భర్త జ్యోతీరావు పూలే 1890 నవంబరు 28న మరణించినప్పుడు ఆ దుఃఖంలో నుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. దేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. పూలే మరణానంతరం సత్యశోధక్ సమాజ్ బాధ్యతనీ స్వీకరించి నడిపించింది.1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. సావిత్రీబాయి పూలే తన కుమారుడు యశ్వంత్తో కలిసి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు. 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులకు, పేదలకోసం ఆమె జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగు వ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890 వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. ప్లేగు వ్యాధి సోకిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకు సోకి 1897 మార్చి 10న మరణించారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించారు. సావిత్రి బాయి జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం గా జరుపుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో కిరణ్ పవన్ మమత సమత పావని స్రవంతి పావని విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు...

# రైతులను ఆదుకోవాలని ఇరిగేషన్ ఈఈని కోరిన బిఆర్ఎస్ నాయకులు

**కల్లూరు, మార్చి 10 (మనం న్యూస్) :** మండలంలో శుక్రవారం సాగర్ ఆయకట్టు రైతులందరూ ఇరిగేషన్ ఈ ఈ కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకొని తమ సమస్యలను విన్నవించుకున్నారు. రైతుల పక్షాన జడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్, బి అర్ ఎస్ మండల అధ్యక్షులు పాలెపు రామారావు లు మాట్లాడుతూ సాగర్ ఆయకట్టు లోఉన్న పొలాలకు సాగు నీరు అందక ఎండిపోతున్నాయని, రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తున్నారని , అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి ఉన్నారని, పంట చేతికొచ్చే సమయంలో పొట్ట దశలో వరికి నీరు లేక పూర్తిగా ఎండిపోయే స్థితికి వచ్చిందని తెలిపారు. బీడు బారీన పొలాలకు నీరు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. రైతులు పరిస్థితిని అర్థం చేసుకొని పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ ఉన్నతాదికారులకు వివరించారు. అనంతరం ఇరిగేషన్ కార్యాలయం నుండి అధికారులను తీసుకొని కప్పల బంధం రెగ్యులేటర్ వద్దకు వెళ్లి పెనుబల్లి, వేంసూరు కెనాల్ కు వెళ్లే నీటిని మదిర కెనాల్ కు తరలించినట్లుగా కట్టా అజయ్ కుమార్ తెలిపారు. రైతుల సమస్యలపై స్పందించిన ఇరిగేషన్ ఈఈ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఖమ్మం నుండి వస్తున్న నీటిని పూర్తిగా మదిర బ్రాంచ్ కి పంపిస్తానని హామీ ఇచ్చారు. రైతులకు ఇబ్బంది పడకుండా రైతులు వేసిన పంటకు నష్టం వాటిల్లకుండా మా వంతు కృషి చేస్తామని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో సిబ్బంది కొరత ఉండడంతో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నామని ప్రస్తుతం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ ఆదేశాల మేరకు మండలంలో పనిచేస్తున్న వీఆర్ఏలకు అదనపు



బాధ్యతలు అప్పగించి సాగునీరుకు ఎటువంటి అంతరాయం కలగకుండా ఇరిగేషన్ ఏ ఈ, డి ఈ నిరంతర పర్యవేక్షణలో రైతుల పంట చేతికి వచ్చేవరకు నీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డిప్యూటీ ఎస్ఈ అప్పలనాయుడు, ఇ ఇ లక్ష్మీనారాయణ, డి ఇ రాజారత్నం, వెంకటేశ్వర్లు ప్రజా ప్రతినిదులు, పోచారం సొసైటీ చైర్మన్ నర్వనేని అంజయ్య, మండల కో ఆప్షన్ షేక్ కమ్లి, మండల కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, నీలాద్రి డైరెక్టర్ భానోత్ బాలు, వల్లభనేని శ్రీనివాసరావు, పుసులూరి శ్రీనివాసరావు, వల్లభనేని రవి, ఆత్మ డైరెక్టర్ నల్లగట్ల పంతులు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# సిసి రోడ్లకు భూమి పూజ



**కల్లూరు, మార్చి 10 (మనం న్యూస్):** మండల పరిధిలో లింగాల గ్రామంలో నిర్మించనున్న సిసి రోడ్లకు శుక్రవారం గ్రామ సర్పంచ్ దేవరపల్లి అరుణనాగ ప్రసాద్ భూమి పూజ చేశారు . గ్రామంలో బీసీ కాలనీ లో చెరుకూరి మోహనరావు ఇంటి వద్ద నుండి మునుగంటి కిరణ్ ఇంటి వరకు రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాలెపు రామారావు, జడ్పిటిసి కట్ట అజయ్ బాబు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య చొరవతో సింగరేణి నిధులు ద్వారా 15 లక్షల రూపాయలు సిసి రోడ్లకు కేటాయించారని, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి పది లక్షల రూపాయలు సిసి రోడ్లకు కేటాయించడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ సారధ్యంలో సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆదేశాల మేరకు మండలంలో ప్రతి గ్రామ పంచాయతీలోనూ, ప్రతి వీధిలోనూ సిసి రోడ్లు నిర్మించాలని, గ్రామాలలో ప్రజలు ఎక్కడ ఇబ్బందులు పడకుండా ఉండాలనే దృక్పథంతో వాడవాడ సిసి రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. భారతదేశంలోనే ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరపల్లి నాగ ప్రసాద్, ఏ ఈ వెంకటేశ్వరరావు , గ్రామ ఉపాధ్యక్షురాలు మట్టూరి రమాదేవి, లింగాల మాజీ ఎంపీటీసీ వేము కృష్ణ, దేవరపల్లి వెంకటేశ్వరరావు , మట్టూరి శ్రీనివాసరావు , పుసులూరి శ్రీనివాసరావు, సెక్రటరీ శీలం రాంబాబు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు పిల్లల విషయంలో వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలి

### – ఎస్ఐ ఎం. సురేష్

**ఎర్రుపాలెం, మార్చి 10 (మనం న్యూస్) :** ఇటీవల కాలంలో కుక్కలు వీర విహారం చేస్తూ ఒంటరిగా వెళ్తున్న వృద్ధులను పిల్లలని స్వైర విహారం చేస్తూ కరుస్తూ కాటేస్తూ దాడిచేస్తు కొరికి చంపేస్తు బీభత్సం సృష్టిస్తున్నాని టీవీల్లో వార్తల్లో సామాజిక మాధ్యమాల్లో ప్రతినిత్యం మనం చూస్తూనే ఉన్నందున పాఠశాలల వద్ద చిన్నపిల్లలను గ్రౌండ్ ఆవరణలో గాని స్కూల్ పరిసర ప్రాంతాల ప్రాంతాల్లో కానీ ఒంటరిగా



వదిలేయకుండా యాజమాన్యం పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అలాగే ఇంటి పరిసరాల వద్ద పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించి వీలైనంత సమయంలో బయటికి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా వచ్చేవి వేసవి సెలవులు కాబట్టి విద్యార్థులకు పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి కొంత సమయం పడుతున్నందున చెరువుల వద్ద గాని బావుల వద్ద గాని మీ ఇంటి పరిసరాల చుట్టూ పిల్లల్ని ఒంటరిగా వదిలేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ కుటుంబంలో ఎవరైనా పెద్దవారు తోడుగా పంపించాలని ఎస్సై ఎం సురేష్ తెలియజేశారు.

## ఐదవరోజుకి చేరుకున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్..



**దుమ్ముగూడెం, మార్చి 10 (మనం న్యూస్):** మండలంలోని ములకపాడు క్రీడా మైదానంలో కుర్స వెంకటేశ్వరావు ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్స్ శుక్రవారం నాటికి ఐదు రోజులకి చేరుకున్నాయి. మొదటి మ్యాచ్ టీచర్స్ 11, లక్ష్మీనరం లెజెండ్ జట్ల, చింతలగూడెం ,బంద్రేవ్ జట్ల ,మిషన్ భగీరథ, సీతారాంపురం జట్ల, మధ్య హోరారిగా సాగిన క్రీడలో విజేతగా లక్ష్మీ నగరం లెజెండ్, చింతలగూడెం, మిషన్ భగీరథ జట్లు విజేతగా నిలిచాయి. ఈ క్రీడలో మంచి ప్రతిగా కనబరిచిన ఆటగాళ్లు రాంబాబు. బాలు. రవికు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఫీల్ ను టిఆర్ఎస్ ఎంపీటీసీ భీమరాజు. ఏఎస్ఐ సత్యనారాయణ. వార్త విలేకర్ సురేష్ కెల్లా అశోక్ చేతుల మీదుగా అందజేశారు.

## గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయడమే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

**బోనకల్, మార్చి 10 (మనం న్యూస్) :** మండల పరిధిలోని గోవిందపురం ఏ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని మధిర నియోజకవర్గం కోఆర్డినేటర్ డా!!వాసిరెడ్డి రామనాథం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి పార్టీని



బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగినదని, ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి కరపత్రాలు పంచుతూ సభ్యత్వాలను చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో దిగ్విజయంగా పూర్తి చేయాలని, రెండు దశాబ్దాల పాటు తెలుగుదేశంపార్టీ అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు ఈ కార్యక్రమంలో బోనకల్ మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ, , జిల్లా నాయకులుభాగం. రమేష్ , మైనేని. రవికుమార్, మరీదు. బరకయ్య, మందా. నరేంద్ర,గ్రామ నాయకులు కావూరి. జనార్ధనరావు, కావూరి. శంకరరావు, బొబ్బిళ్ల. తిరుపతిరావు, మేడేపల్లి. కోటేశ్వరరావు, వడ్డెబోయిన. సాయి బొబ్బిళ్ల. వెంకయ్య, సాలె. సుందరరావు ,అనుబోతు. వెంకటనారాయణ, పొట్టపెంజర. చిన్నజమలయ్య, షేక్సా.పెద్ద మస్తాన్ ,షేక్సా.రంజాన్బీ, షేక్జీ.సలీం, పార్టీ కార్యకర్తలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 16న మహిళా ప్రజా ప్రతినిధులకు, మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు..

**దుమ్ముగూడెం,మార్చి 10 (మనం న్యూస్) :** మండల ప్రజా ప్రతినిధుల పదవీకాలం నాలుగు సంవత్సరములు పూర్తి చేసుకొని 5వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మార్చి 16న మహిళా ప్రజా ప్రతినిధులకు, మండల పరిషత్తు మహిళ ఉద్యోగులకు స్నేహపూర్వక క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు కబడ్డీ టెన్నికాయిడ్ షటిల్ మ్యూజికల్ చైర్ లెమన్ అండ్ స్పూన్ తాడు లాగుడు తదితర ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తెలిపారు ఈ పోటీలలో పాల్గొనదలచిన మహిళా ప్రజాప్రతినిధులు మండల పరిషత్ మహిళా ఉద్యోగులు సోమవారం సాయంత్రం నాలుగు గంటల లోపు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ జి శ్రావణి కి తమ పేర్లను అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రాయల నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించిన సీపీఐ జిల్లా కార్యదర్శి

**తిరుమలాయపాలెం, మార్చి 10 (మనం న్యూస్) :** తాను నమ్మిన సిద్ధాంతానికి తుది శ్వాస వరకు కట్టుబడి చేసిన రాయల నాగేశ్వరావు ధన్యుడని నిబద్ధత గల నాయకునిగా ఆయన పేరొందారన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



తెలిపారు బుధవారం మరణించిన తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామ సర్పంచ్ రాయల నాగేశ్వరావు చిత్రపటానికి పోటు ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో నిర్బంధాలు ఎదురైన పార్టీ నిర్ణయానికి సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తిగా పేరొందారని ఆయన తెలిపారు పిండిప్రోలు గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేసిన రాయల అభివృద్ధి ప్రదాతగా పేరొందారన్నారు రాయల కుటుంబం ఎర్ర జెండాకు అంకితమై పని చేసిందని ఆయన అన్నారు అటువంటి వ్యక్తి అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లగూడెంలో ఆయుర్వేద వైద్య శిబిరం...

**కరకగూడెం, మార్చి 10 (మనం న్యూస్):** కరకగూడెం మండల కేంద్రంలోని గొల్లగూడెం గ్రామపంచాయతీలో ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్య శిబిరం డాక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ ఇర్పా విజయ్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



ఆయుర్వేదిక్ మందుల వలన దీర్ఘకాలిక వ్యాధులు తొలగిపోతాయని ఆయన తెలిపారు. ఆయుర్వేదిక్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తదనంతరం డాక్టర్ కుమారస్వామి మాట్లాడుతూ. పంచాయతీ పరిధిలో సుమారు 200 మంది రోగాలను పరీక్షించామని వారందరికీ ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఆయుర్వేదిక్ మందుల వలన ఎటువంటి సైడ్ ఎఫెకట్స్ ఉండవని తన తెలిపారు ప్రజలు అందరూ తప్పకుండా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తమ ఆసుపత్రికి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఎన్ ఓ శ్రీనివాసరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# చిరుత పులి చర్మం స్వాధీనం

**– 9 మంది అరెస్ట్**
**– అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎ అప్పయ్య**
**– చత్తీస్గఢ్ కు చెందిన 3 ఏపీ కు చెందిన 5 తెలంగాణకు చెందిన ఒకరు మొత్తం తొమ్మిది మంది అరెస్ట్**
**– మూఢనమ్మకాలు కారణంగా వన్య ప్రాణుల వధ**



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 10 (మనం ప్రతినిధి) :** అరుదైన వన్యప్రాణి విభాగానికి చెందిన చిరుతపులి ఛర్మాన్ని స్వాధీనం చేసుకుని 9 మంది నిందితులను అరెస్టు చేసినట్లు కొత్తగూడెం అసిస్టెంట్ కన్వర్టర్ ఆఫ్ ఫారెస్ట్ ఏ అప్పయ్య మీడియా సమావేశంలో వెల్లడించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం డివిజన్ అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. చత్తీస్గడ్ రాష్ట్రంలోని చింతల్ నా అటవీ ప్రాంతంలో సుమారు 6 నెలల క్రితం చత్తీస్గఢ్ కు చెందిన ముగ్గురు వ్యక్తులు మగ చిరుతపులిని వేటాడారని, అనంతరం ఆ చెరుత పులి చర్మాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చింతూరు అటవీ ప్రాంతంలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తుల వద్దకు తీసుకువచ్చి వారి వద్ద ఉంచారని తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం (ఒంగోలు) జిల్లాకు చెందిన మరో ముగ్గురు వ్యక్తులు అందరూ కలిసి అంతర్జాతీయ మార్కెట్లో చిరుత పులి చర్మాన్ని సొమ్ము చేసుకుందామని ప్రయత్నాలు సాగించారని అప్పయ్య తెలిపారు. ఈ నేపథ్యంలో, సారపాక ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి కలిసి ఈ చర్మాన్ని అమ్మేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్న తరుణంలో అంతిమంగా కొత్తగూడెం పట్టణంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు సమీపాన ఉన్న అటవీ ప్రాంతంలో 9 మంది వ్యక్తులు సమాలోచనలు చేస్తుండగా, చిరుత పులి చర్మాన్ని స్వాధీనం చేసుకొని, 9 మంది వ్యక్తులను అటవీశాఖ సిబ్బంది అరెస్టు చేసినట్లు తెలిపారు. కాగా అటవీ శాఖ 'సెర్చ్ టీం' రెండు నెలల నుండి వీరిపై నిఘా ఉంచి వీరి కదలికలను నిత్యం గమనిస్తున్నట్లు ఏ సి ఎఫ్ అపాయ తెలిపారు.

**మూఢ విశ్వాసాల కారణంగా వన్యప్రాణుల మనుగడకు ముప్పు :** ప్రజలలో నెలకొని ఉన్న మూఢవిశ్వాసాల కారణంగా వన్యప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఎసిఎఫ్ అప్పయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చిరుత పులి చర్మంపై కూర్చొని క్షుద్ర పూజలు నిర్వహించినట్లయితే కరెన్సీ నోట్ల కట్టల వర్షం కురుస్తుందని మూఢవిశ్వాసాలను అడ్డుపెట్టుకొని చిరుత పులి చర్మాన్ని అంతర్జాతీయ మార్కెట్లో అమ్మేందుకు ప్రయత్నం చేశారని ఎట్టాకేలకు పట్టుపడ్డారని ఏసిఎఫ్ అప్పయ్య తెలిపారు. మూడవిశ్వాసాల కారణంగా అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దీంతోపాటు అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా ఉందని అడవులు ఉంటేనే వన్యప్రాణుల మనవడ సాధ్యమవుతుందని వన్యప్రాణులు ఉంటేనే వాతావరణ సమతుల్యత లేదా స్థిరంగా ఉంటుందని ఏసిఎఫ్ అక్కయ్య తెలిపారు. ఈ మీడియా సమావేశంలో కొత్తగూడెం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సురేష్, రామవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఉమ, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభలలో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

**– రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య**



**తిరుమలాయపాలెం, మార్చి 10 (మనం న్యూస్) :** బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడిజిల్లా సమావేశం పిండిప్రోలు రామమూర్తి అధ్యక్షులు ఉమ్మడి జిల్లాల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్ కృష్ణ అన్నగారు మాట్లాడుతూ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారు తప్ప బీసీలకు రాజ్యాధికారం అంద నీ ద్రాక్ష గానే మిగిలిపోతుందని మేమెంతో మాకంత వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో 50 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో తిరిగి అసెంబ్లీలో తీర్మానాలు చేపించి కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవడానికి నా వంతు కృషి చేస్తున్నానని జనగణన లో బీసీ కులగలను చేయాలని 70 ఏళ్ల సాయంత్రం వచ్చినా బీసీ లెక్కలు లేకపోవడం శోచనీయమని కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ లకు క్రిమిలేరు ఎత్తివేయాలని అని ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష లా కోట్ల బడ్జెట్లో బీసీలకు ఎక్కువ నిధులు కేటాయించాలి బీసీలను ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదిగేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ బందు పథకం ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయలు బడ్జెట్ కేటాయించాలని బీసీ కార్పొరేషన్ ఎంబీసీ కార్పొరేషన్ కుల ఫెడరేషన్లకు నిధులు ఇవ్వడం లేదని వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్ కృష్ణ గారు జిల్లా ప్రధాన కార్యదర్శి కేసోజు రఘుబాబు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అనుముల సోమయ్య ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు పడిశనబోయిన రమేష్ రిటైర్డ్ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నోజు పుల్లయ్య ఆఫీసు ఇంచార్జి పోతగాని రమణ కుమార్ విద్యార్థి సంఘం ప్రెసిడెంట్ లగిశెట్టి మహేష్ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాసాని బ్రహ్మం ఉమ్మడి జిల్లాల మహిళా అధ్యక్షురాలు నలమా సుగుణ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత మేడం ఖమ్మం నగర ప్రధాన కార్యదర్శి గద్దె వెంకటరామయ్య రూరల్ మండలం అధ్యక్షులు సావిడి శ్రీనివాస్ తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడు మేకల సైదులు విద్యార్థిని విద్యార్థులు మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు రాష్ట్ర మహాసభలు వాయిదా

**మణుగూరు, మార్చి 10 (మనం న్యూస్) :** సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ (సిఐటియు) రాష్ట్ర మహాసభలను వాయిదా వేసినట్లు బ్రాంచ్ కార్యదర్శి వల్లూరి వెంకటరత్నం శుక్రవారం తెలిపారు జలపాడు సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీలలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ -సిఐటియు రాష్ట్ర మహాసభలు ఆర్జి-1 ఏరియా గోదావరిగనిలో జరగాల్సి ఉందన్నారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు ప్రకటించారన్నారు ఈనెల 13 తేదీన డిప్యూటీ లేబర్ కమిషనర్ (సిఎల్సి) హైదరాబాద్ లో సింగరేణి గుర్తింపు ఎన్నికలకు సంబంధించి రిజిస్టర్ సంఘాల ఆహ్వానించి సమావేశం ఏర్పాటు చేసినందున జరగాల్సిన రాష్ట్ర మహాసభలు వాయిదా వేయడం జరిగిందని తెలిపారు. తదుపరి తేదీలు త్వరలో ప్రకటన




చేస్తాం ఆయన అన్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ అధ్యక్షులు టీవీ ఎం.వి ప్రసాద్ నందం ఈశ్వరరావు మాచారపు లక్ష్మణరావు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు

# ఎక్సెలెంట్ బాషా హై స్కూల్‌లో ఘనంగా ఫేరవెల్ వేడుకలు

**– ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ రేగా కాంతారావు**




**పినపాక, మార్చి 10 మనం న్యూస్) :** పినపాక మండలం లోని బయ్యారం క్రాస్ రోడ్ నందు గల ఎక్సలెంట్ బాషా హై స్కూల్ నందు ఏర్పాటు చేసిన ఫెరవెల్ డే కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు హాజరయ్యార ు.తొలిత తొమ్మిది వ తరగతి, పదవ తరగతి విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మీకు పరీక్షల సమయం చాలా దగ్గరలో ఉన్నాయి,పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు చాలా కష్టపడి చదవాల్సిన అవసరం ఉందని అన్నారు.విద్య వ్యవస్థలో అందుబాటులో ఉన్న వనరుల ను సద్వినియోగం చేసుకోని విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆయన అన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ఉన్నత శిఖరాలను అందుకోవడానికి అర్హత సాధిస్తారని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువులో బాగా రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని అన్నారు. చిన్నారులు కన్నుల విందు గా నృత్యాలు, ఆట పాటలతో తమ ప్రతిభను చూపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ రాజగోపాల్, ఎస్ ఐ నాగుల్ మీరా, ఎక్సలెంట్ గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ ఎండి యూసఫ్ షరీఫ్, ఎక్సలెంట్ గ్రూప్ అఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ ఎండీ ఖాదర్, డైరెక్టర్స్ ఎండీ ఎండీ యాకుబ్ షరీఫ్, ఎండీ ఖాన్, ముక్కు నర్సారెడ్డి, బండారు నరేంద్ర, ప్రిన్సిపాల్ అంకం సురేష్ , సీనీయర్ ఉపాధ్యాయురాలు వాల్సలా మోహన్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

**– బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ పిలుపు**



**నేలకొండపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** సంఘసంస్కర్త, సామాజికవేత్త, అభ్యుదయ వాది జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని శుక్రవారం మండలం లోని కొత్త కొత్తూరు గ్రామంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సంఘసంస్కర్తగా, ఉపాధ్యాయురాలు, రచయిత్రిగా నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కుల మతాలకు అతీతంగా ప్రజలందరిని ప్రేమించిన స్ఫూర్తి ప్రదాత అన్నారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు వెన్నపూసల సీతారాములు, బీసీ సంఘం నాయకులు తోగటి నాగాచారి, రాయవరపు నాగరాజు, వల్లాల కృష్ణ, దేవరశెట్టి సత్యం, గ్రామపంచాయతీ కార్యదర్శి బండి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో రైతు దీక్ష



**కల్లూరు, మార్చి 10 (మనం న్యూస్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు చావా కిరణ్ పిలుపు మేరకు మండలంలో శుక్రవారం రైతుదీక్ష కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో రైతు దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షుడు గుమ్మ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఈవూరు నాగేశ్వరావు పాల్గొని రైతుల సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ తో పాటు వడ్డీ మొత్తాన్ని కలిపి వెంటనే అమలు చేయాలని అన్నారు. ధరణి పోర్టల్ తో ఇబ్బందిపడుతున్న రైతుల సమస్యలను వెంటనే పరిష్కరింప చేసే విధంగా మార్పులు చేయాలని కోరారు. ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టి రైతులను ఆదుకోవాలని సూచించారు. రైతులకు నిరంతరాయంగా 24 గంటలు త్రీఫేస్ కరెంటు సప్లై చేయాలని, పంట చేతికి వచ్చేంతవరకు సాగర్ జలాలను ఏప్రిల్ చివరి వరకు వారబందీ లేకుండా నీరు అందించాలని అన్నారు. రైతుల సమస్యల డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మార్వో కార్యాలయంలో అధికారులకు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షులు ఆనంగి నరసింహారావు,జిల్లా కార్యదర్శి అమ్మను మంచి కృష్ణమోహన్, మండల కార్యవర్గ సభ్యులు కామిశెట్టి రంగారావు, వడ్లమూడి శ్రీనివాసరావు ఎం వి రామిరెడ్డి , ప్రధాన కార్యదర్శి అనిల్ రైతులు పాల్గొనడం జరిగినది.

# బీసీలు ఐక్యత కలిగి రాజ్యాధికార లక్ష్యంగా అడుగులు వేయాలి

**– బీసీ కులాలలో హెచ్చుతగ్గులను విడనాడి ఐక్యంగా పనిచేయాలి**
**– బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు**
**– బీసీ సంక్షేమ సంఘం ద్వారా పలు సంక్షేమ పథకాలతో పాటు రిజర్వేషన్లు సాధించాం**
**– ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలు ఐక్యంగా రాజ్యాధికారం దిశగా అడుగులు వేసి నిజమైన అభివృద్ధి సాధించాలి**
**– బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య**

**సత్తుపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల ప్రజలు కులాలలో ఇచ్చి తగ్గులను మాని రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలని అప్పుడే నిజమైన అభివృద్ధి కనిపిస్తుందని రాజ్యసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు, శుక్రవారం సత్తుపల్లి పట్టణం స్థానిక శ్రీ లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటుచేసిన, ఖమ్మం జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు నారాయణ వరపు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ, 1973 వ సంవత్సరం నుంచి అనేక ఉద్యమాలతో అనేక సంక్షేమ పథకాలతో పాటు రిజర్వేషన్లు కల్పించడంలో బీసీ సంక్షేమ సంఘం కృషి పట్టుదల చాలా శ్వాసనీయమన్నారు, 55% జనాభా ఉన్న బీసీలను పార్లమెంట్ అసెంబ్లీ స్థానాల్లో రిజర్వేషన్ కల్పించి అభ్యర్థుల ఎంపికలో సముఖిత స్థానం కల్పించాలని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రిలు ఆయన కోరారు, పార్లమెంట్లో బీసీల రిజర్వేషన్ చట్టం తేవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు, మన రాష్ట్రం కాకపోయినప్పటికీ బీసీ సామాజిక వర్గాన్ని గుర్తించి సముచిత స్థానం కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు, మిగతా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ ను ఆదర్శంగా తీసుకొని బీసీలకు తగిన న్యాయం చేయాలని ఆయన కోరారు, బీసీలు ఇప్పటివరకు సాధించిన విజయాలు పోరాడి సాధించుకున్న విజయాలని భవిష్యత్తులో మరింత పోరాటానికి గ్రామస్థాయి నుంచి నాయకత్వం లక్షణాలు కలిగిన వ్యక్తులను ప్రోత్సహించి ముందుకు నడపవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు, ఇప్పటికి ది ఫీజు రీయింబర్స్మెంట్, హాస్టల్ విద్యార్థులకు వసతి కల్పించడంతో పాటు రిజర్వేషన్లు సాధించిందని భవిష్యత్తులో రిజర్వేషన్ స్థానాన్ని పెంచేందుకు పార్లమెంట్లో మన వానిని వినిపించేందుకు బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు



వేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు, పలు రాష్ట్రాల్లో అమలవుతున్న రిజర్వేషన్లను మన పక్కన ఉన్న చతిస్గడ్ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని పలుసార్లు కలిసినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు, ఎస్సీ ఎస్టీ బీసీ కులాలు హెచ్చుతగ్గులను వీడి అందర్నీ కలుపుకొని పోతూ. రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని, కేవలం 5% ఉన్న నిమ్మని వర్గాలు మనని పాలిస్తుంటే 75% ఉన్న మనం అభివృద్ధి చెందలేకపోతున్నామని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు, రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలు ఏ కవితాటిపై ఉంది రాజ్యాధికారాన్ని సాధించాలని ఆయన కోరారు, అనంతరం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య గజిమాలతో ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదేపల్లి కృష్ణమాచారి , రెడ్డి మల్ల వెంకటేశ్వరరావు, తెలంగాణ అధ్యక్షులు ఎర్రం సత్యనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, తెలంగాణ కన్వీనర్ లాలా కృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి, సత్తుపల్లి మాజీ ఎంపీపీ చల్లా ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, మల్లెపూల వెంకటేశ్వరరావు, తో పాటు పలువురు స్థానిక బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చర్చి నిర్మాణానికి రూ. 10 వేలు సహాయం చేసిన సొసైటీ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి

**తల్లాడ, మార్చి 10 (మనం న్యూస్):** మండల పరిధిలోని కుర్నవల్లి లో నూతనంగా నిర్మించనున్న చర్చి నిర్మాణానికి కుర్నవల్లి సొసైటీ చైర్మన్ అయిలూరి ప్రదీప్ రెడ్డి పదివేల రూపాయలను వితరణగా చర్చి ఫాదర్ కిరణ్ కు శుక్రవారం అందజేశారు, ఈ సందర్భంగా ఫాదర్ కిరణ్ మాట్లాడుతూ నూతన చర్చి నిర్మాణానికి పదివేల రూపాయలు అందజేసిన ఆయిలూరి ప్రదీప్ రెడ్డిని ఆయన అభినందించారు, ఇతరులకు సహాయం చేయడం , ప్రేమ, జాలి కలిగియున్న వారికి దేవుని కృప ఉంటుందన్నారు, చర్చి నిర్మాణానికి దాతల ముందుకు వచ్చి సహకరించాలని కోరారు అనంతరం ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుంది అన్నారు అందులో భాగంగానే ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సూచన మేరకు అభివృద్ధి కార్యక్రమాలకు



ముందుంటున్నామన్నారు కార్యక్రమంలో చర్చి పెద్దలు ఆదూరి బుచ్చాలు, ఎక్కిరాల రవి, కొత్తపల్లి శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**అన్నపురెడ్డిపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** మండల పరిధిలోని అన్నపరెడ్డిపల్లి, అన్నదైవం, మరియు వొద్దుగూడెం గ్రామాలలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా నేటి ఉదయం 8:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది కనుక గ్రామాలలో వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎఇ తెలిపారు.

# క్రికెట్ ప్రీమియం లీగ్ ప్రారంభం

**– ముఖ్య అతిథులుగా సర్పంచ్ రాణి, సబ్ ఇన్స్పెక్టర్ షాహీనా**

**అన్నపురెడ్డిపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** క్రికెట్ ప్రీమియం లీగ్ ను పెంట్లం గ్రామపంచాయతీ స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్ ప్రారంభ ోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా పెంట్లం గ్రామ పంచాయతీ సర్పంచ్ సవలం రాణి స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్టీ షాహినా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సు షాహినా ను సర్పంచ్ గ్రామ పెద్దలు శాలువా తో సత్కరించారు.షాహినా మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించిన యువకులు గ్రామాల్లోని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన సత్పరివర్తన నేర్పించేందుకు కృషి చేయాలని కోరారు.గ్రామ పెద్దలు కుల పెద్దలు పంచాయతీల్లో పరిమితికి మించిన విషయాలను పరిష్కరించవద్దని.చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారు ఎవరైనా చట్టం ముందు దోషులుగా నిలబడాల్సిందేనని వివాదాలకు తావివ్వకుండా యువకులు క్రీడా స్ఫూర్తితో శ్రమిస్తే విజయం సాధ్యం అని ప్రోత్సహించి .రిబ్బన్ కట్ చేసి బ్యాటు బాల్ తో మైదానం పై ఆట ప్రారంభించి యువకులను ఉత్సాహపరిచారు.కార్యక్రమంలో సోయం రాంబాబు



కంచు రామకృష్ణ భూపతి నరసింహారావు సవలం ప్రకాష్ మందాస్ ఏల్లయ్య రింగు నాగబాబు బత్తుల వెంకన్న బోయినపల్లి చందు తాటికొండ శంకరాచార్య బన్నే వెంకటేశ్వర్లు ఈదూరి మధుసూదన్ రావు ఓర్సు రామస్వామి తాటి వెంకట్రాములు క్రీడాకారులు ఉన్నారు.

# రైతు రుణాలను తక్షణమే మాఫీ చేయాలి

**– బిజెపి రైతు దీక్షలో నున్న రవికుమార్ డిమాండ్**

**నేలకొండపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** రైతు రుణాలను బిఆర్ఎస్ ప్రభుత్వం తక్షణమే మాఫీ చేయాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం



స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నె కృష్ణారావు అధ్యక్షతన జరిగిన దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణాలను మాఫీ చేస్తామని వాగ్దానం చేసి నాలుగేళ్లు గడుస్తున్న నేటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ ను బీఆర్ఎస్ పార్టీగా మార్చి రైతులను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ధరణి పోర్టల్, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేసిందని మండిపడ్డారు. రైతులకు 24 గంటల విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని, యాంత్రికరణ కోసం సబ్సిడీపై ట్రాక్టర్లు, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు చావా కిరణ్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షర్ఫుద్దీన్, భవనాసి దుర్గారావు, కోటి హనుమంతరావు, మన్నే రాధాకృష్ణ, కలింగి వెంకటేశ్వర్లు, గోవింద్, రామకృష్ణ, రమణ మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.బి. ఐ.టి.లో ముగిసిన మూడు రోజుల క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ

**ఖమ్మం, మార్చి 10 (మనం న్యూస్) :** ఖమ్మం ఎస్.బి. ఐ.టి.ఇంజనీరింగ్ కళాశాల లో టాస్క్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎ.డబ్ల్యు.ఎస్.క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణా కార్యక్రమం శుక్ర వారం తో ముగిసింది.ఈ కార్యక్రమం లో కళాశాల చైర్మన్



గుండాల కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత టెక్నాలజీ లో క్లౌడ్ కంప్యూటింగ్ ఎక్కువ ట్రెండ్ అవుతుందని, దీనిని దృష్టి లో ఉంచుకొని ఈ మూడు రోజుల పాటు విద్యార్థులకు క్లౌడ్ టెక్నాలజీపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.జి. ధాత్రీ మాట్లాడుతూ విద్యార్థుల కోసం కావాలసిన అత్యాధునిక సాంకేతిక శిక్షణలు యాజమాన్యం నుండి నిర్వహించేందుకు సిద్ధం గా ఉన్నామని అన్నారు. టాస్క్ ట్రైనర్ హేమంత్ కృష్ణ మాట్లాడుతూ టాస్క్ ఆధ్వర్యాలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆర్టిఫీషియల్, రోబోటిక్స్ తో పాటు పలు అంశాలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.భవిష్యత్ లో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు టాస్క్ సిద్ధం గా ఉందని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.రాజ్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణలు నిర్వహిస్తున్న టాస్క్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యాజమాన్యం శిక్షణ ఇచ్చిన టాస్క్ ప్రతినిధుల ను ఘనంగా సన్మానించింది.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాస రావు,అకడమిక్ డైరెక్టర్లు ఎ.వి.వి.శివ ప్రసాద్,జి.ప్రవీణ్ కుమార్,డా.జి. సుభాష్ చందర్,డా. జె.రవీంద్ర బాబు,టి.పి. ఒ.లు ఎన్.సవిత, ఎ. మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# రాజయ్య నగర్లో గిరిజనుడు దారుణ హత్య

**– మావోయిస్టులా ? వ్యక్తిగత కక్ష్యలా ?**

**చర్ల, మార్చి 10 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని సుబ్బంపేట గ్రామపంచాయతీ రాజనగర్ గ్రామంలో గురువారం రాత్రి గిరిజనుడి హత్య జరిగింది.ఛత్తీస్గఢ్ రాష్ట్రం జేగురుకొండ (పెద్దగొల్లూరు) కు చెందిన సప్కా రమేష్ గంగయ్య



సుమారు రెండు దశాబ్దాలనాడు ఈ గ్రామానికి వసల వచ్చాడు. ఇక్కడి నుంచి మూడేళ్ళ క్రితం ములుగు జిల్లాకి మకాం వెళ్ళి ఇక్కడకు అడపాదడపా వచ్చి వెళుతున్నాడు. ఆ క్రమంలో ఇటీవల వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. రమేష్కు ఇద్దరు భార్యలు. పెద్దభార్యకి ఇద్దరు సంతానం. చిన్నభార్య ప్రస్తుతం ఆరునెలల గర్భిణి. చిన్నభార్య లక్ష్మి ఇంటిలో నిద్రించగా, పెద్దభార్యతో రమేష్ ఆరుబయట నిద్రించాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఐదుగురు వ్యక్తులు వచ్చి నిద్రపోతున్న సప్కా రమేష్ని లేపి కర్రలతో కొట్టి కత్తులతో పొడిచి హత్య చేశారు.అడ్డపడిన పెద్ద భార్యని కూడా కొట్టారు. వచ్చినవారు నల్లరంగు దుస్తులు, ముసుగులు వేసుకున్నట్లు పెద్దభార్య దేవి తెలిపింది.ఏజెన్సీలో జరిగిన ఈ హత్య అందరిని ఉలిక్కిపాటుకి గురిచేసింది. దీనిపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సీఐ అశోక్ గ్రామస్థుల ద్వారా మృతదేహం భద్రాచలం తీసుకెళ్ళి దగ్గర ఉండి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని ప్రజాపంథా చర్ల మండల కార్యదర్శి కొండా చరణ్ ప్రభుత్వాన్ని కోరారు.

# మత్స్య సంపద పెంపుకై ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

## – జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



**ఖమ్మం, మార్చి 10 (మనం బ్యూరో) :** జిల్లాలో మత్స్య సంపద పెంపుకై ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో అధికారులు, ఆక్వా రైతులతో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ఆక్వా కల్చర్ జిల్లా స్థాయి సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీలి విప్లవం, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ల ద్వారా మత్స్యకారుల అభివృద్ధికి చర్యలు చేపట్టుతున్నట్లు తెలిపారు. ఈ పథకాల క్రింద చేపల చెరువుల నిర్మాణం, చేపల సీడ్ హాచరీలు, చేపల సీడ్ రియరింగ్ యూనిట్ల నిర్మాణం, చేపల కల్చర్ కు ఇన్ పుట్ కాస్ట్ లకు ఎస్సి, ఎస్టీ లకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ అందజేస్తున్నట్లు ఆయన అన్నారు. జిల్లాలో నీలి విప్లవం క్రింద చేపల సీడ్ రియరింగ్ యూనిట్లకు 32 దరఖాస్తులు, చేపల సీడ్ హాచరికి ఒకటి, ఆర్ఏఎస్ కి ఒక దరఖాస్తు వచ్చాయన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన క్రింద చేప సీడ్ రియరింగ్ యూనిట్ల కొరకు 6 దరఖాస్తులు, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన క్రింద క్రొత్త చేపల చెరువుల నిర్మాణానికి 11, ఆర్ఏఎస్ కి 3, బయో ఫ్లోక్ కి 2 దరఖాస్తులు అందినట్లు ఆయన అన్నారు. దరఖాస్తుదారులు వారి పేరుపై భూమికి క్లియర్ టైటిల్ కల్గివుండాలని, లీజుదారుడైతే కనీసం 5 సంవత్సరాల కాలపరిమితి లీజు కల్గివుండాలని ఆయన తెలిపారు. ఆక్వా రైతులకు పథకాలపై అవగాహన కల్పించాలని, వచ్చిన దరఖాస్తుల క్షేత్ర పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి, త్వరితగతిన గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య అధికారి ఆంజనేయ స్వామి, జెడ్పి సిఇఓ అప్పారావు, డిఆర్డీఓ విద్యాచందన, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా నీటిపారుదల అధికారి వెంకట్రాం, మత్స్య, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు, ఆక్వా రైతుల పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి స్కాలర్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన మానస

## – పదివేల నగదు చెక్కును అందజేసిన ఎస్ఓ కమలవాహిని ఇందిరా జ్యోతి



**బోనకల్, మార్చి 10 (మనం న్యూస్)** :కస్తూరిబా బాలికల పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి ఎస్ మానస రాష్ట్ర స్థాయి స్కాలర్ షిప్ టెస్ట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించింది.ప్రకాశం జిల్లా చిన్నగంజాం మండలం సంతరావూరి గ్రామస్తుడైన నూనె రాజశేఖర్ స్కాలర్షిప్ పరీక్షను ఆయన కుమారుడు లక్ష్మణ్ బాబు రెండు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలల్లో పోటీలను నిర్వహించడం జరిగింది.ఈ స్కాలర్షిప్ పోటీలకు బోనకల్ కస్తూరిబా గాంధీ పాఠశాల నుంచి పాల్గొన్న మానస అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పదివేల రూపాయలు ప్రథమ బహుమతి గెలుచుకుంది.ప్రథమ బహుమతి సాధించిన మానసకు నిర్వాహకులు లక్ష్మణ్ బాబు,జిసిడిఓ ఉదయశ్రీ చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం చేశారు.స్పెషల్ ఆఫీసర్ బి కమలావాహిని మరియు ఉపాధ్యాయులు,సిబ్బంది మానసకు అభినందనలు తెలియజేశారు.

# 4 లక్షల ఎకరాలకు పరిమితం చేసి పోడు సమస్యను జటిలం చేయొద్దు

## – సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా – సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పోడు పట్టా అందించాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 10 (మనం ప్రతినిధి) :** రాష్ట్ర వ్యాప్తంగా పేదల సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పోడు పట్టా జారీ చేయాలనీ సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 4 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు జారీ చేస్తామని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై అయన స్పందిస్తూ రాష్టంలో 12.46లక్షల ఎకరాల పోడు భూమి పేదల చేతుల్లో ఉందని, అనాదిగా ఈ పోడును సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని అన్నారు. 12.46 లక్షలకు సంబంధించి 4. 14లక్షల పోడు సాగుదారులు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే 2.99 లక్షల ఎకరాలు సుమారు రెండు లక్షల గిరిజనుల చేతిలో ఉందని, సుమారు 40 లక్షల ఎకరాలు ఇతర గ్రామీణ నిరుపేదల చేతిలో ఉందని, ఈ సమస్యకు శాశ్వత పరిసా క్రరం చూపాలంటి సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పోడు పట్టా అందించాల్సిన భాద్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సీతారామ



సాగర్, పోలవరం, బిటిపిఎస్, ఓపెన్ కాస్టుల పేరుతో లక్షలాది ఎక్కరాల సాగుభూమి భద్రాద్రి జిల్లాలో విధ్వంసానికి గురి ఐన పరిస్థితిలో పోడుపై పూర్తి స్థాయిలో హక్కులు కల్పించకుంటే వ్యవసాయమే కనుమరుగయ్యే ప్రమాదకర పరిస్థిలు ఏర్పడతాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి ధరఖాస్తుదారులందరికి పోడు పట్టాలు అందించి ఈ సమస్యకు శాశ్వత పరిస్కారి చూపాలని, పరిమితి విధించి సమస్యను మరింత జటిలం చేయవద్దని సాబీర్ పాషా సూచించారు.

# తెలుగుదేశం పార్టీ బలోపేతానికి మండల స్థాయిలో ఇంటింటి ప్రచారం..



**ఇల్లందు, మార్చి 10 (మనం న్యూస్) :** ఇల్లందు తెలుగుదేశం పార్టీ నాయకులు ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో శుక్రవారం 20వ వార్డులో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలుగుదేశం పార్టీ చారిత్రాత్మక అవసరం మని టీడీపీ నాయకులు ముద్రగడ వంశీ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాతనే ఎన్టీఆర్ కృషితో పేద వర్గాలు, మహిళలు, ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా చైతన్యవంతులై ఆత్మగౌరంతో బ్రతికారని వివరించారు. రాష్ట్రంలో పేద వర్గాలకు వేదికైన టీడీపీ నీ లేకుండా చేయాలనే కుట్రలో భాగంగానే కేసీఆర్ తెలుగుదేశం పార్టీని బలహీనపరచాడానికి కుట్ర పన్నారని , దీంతో పేద వర్గాలకు తీవ్రంగా నష్టంజరుగుతుందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు మర్చిపోలేదని ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ చారిత్రాత్మక అవసరాన్ని వివరిస్తామన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ ముందుచూపుతో చేసిన కార్యక్రమాలతోనే నేడు రాష్ట్ర సంపద పెరిగి కేసీఆర్ విచ్చలవిడిగా ఖర్చు పెడుతూ రాజ్యమేలుతున్నాడని అన్నారు. స్వర్గయ ఎన్టీఆర్ ఆశయాలను టిడిపి అధినేత చంద్రబాబు విధానాలను ఇంటింటికి వెళ్లి వాస్తవలను ప్రజలకు చెప్పి, ప్రజా సమస్యలను తెలుసుకుని కార్యచరణ రూపొందించుకుని ప్రజల పక్షాన తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తుందని ప్రజలు అండగా ఉండాలని కోరారు. నాంపల్లి మండల పార్టీ అధ్యక్షతన జరిగినది.ఈ కార్యక్రమంలో శ్యామ్ తీవరి, కంది రవి,సుబ్బారావు, రామకృష్ణ, విజయ్, కళ్యాణ్, మహిళా నాయకురాలు నాగలక్ష్మి, రాంబాయి, సమ్మక్క, తులసి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**సత్తుపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** మండల పరిధిలోని గంగారం పాఠశాలలో శుక్రవారం ఎస్వీడీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బి. గంగారం నందు వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ నందు తెలుగు, ఇంగ్లీష్ మీడియం లో ప్రధమ మరియు ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు 5,000 రూ. నగదు బహుమతి మరియు మెమొంటోలు అందజేయడం జరిగింది. గత సంవత్సరం ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షల నందు తెలుగు మరి ఇంగ్లీష్ మీడియం లలో అత్యధిక గ్రేడ్ సాధించిన విద్యార్థులకు 10,000 రూ. నగదు బహుమతి అందజేయడం జరిగింది. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు ఎం. రామ్మోహన్ రెడ్డి , కోశాధికారి బాల నాగేశ్వరరావు,గౌరవ సలహాదారు డి వెంకట్రాం రెడ్డి , కార్యదర్శి సత్యనారాయణ మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




# నెల మొదటి తేదీన వేతనాలు చెల్లించాలి

## – టియస్ యుటియఫ్ డిమాండ్

**మధిర, మార్చి 10 (మనం న్యూస్):** నెల మొదటి తేదీకి చెల్లించాల్సిన వేతనాలు పదవ తేదీ వచ్చినా జమ కాకపోవటం ప్రభుత్వ అసమర్థతను చాటుతుందని టి ఎస్ యు టి ఎఫ్ మధిర మండల కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలోవిమర్శించింది. వేతనాలు సకాలంలో అందక ఇయమ్ఐ లు చెల్లించాల్సిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెనాల్టీలు చెల్లించుకోవాల్సి వస్తుందని , ఈ పరిస్థితిని మార్చి ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, ఈ కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించాలని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. వినోద్ రావు, షేక్ నాగూర్ వలి డిమాండ్ చేశారు.ప్రతి నెలా మొదటి తేదీ నాడు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికినీ, రోజుకు కొన్ని జిల్లాల చొప్పున వాయిదాల పద్ధతిలో వేతనాలు చెల్లించడమేమిటని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లు సకాలంలో వేతనాలు, పెన్షన్లు మరియు ఇతర ఏరియర్ బిల్లులు అందక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆలోచనా ధోరణి మార్చుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రతి నెలా మొదటి తేదీ నాడు వేతనాలు, పెన్షన్లు చెల్లించాలని టీఎస్ యుటియఫ్– మధిర మండల కమిటీ వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ నాయకులు మాగినం రాంబాబు మృతికి సంతాపం తెలిపిన సర్పంచ్

**మధిర, మార్చి 10 (మనం న్యూస్):** మధిర మండల పరిధిలోని దెందుకూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రెసిడెంట్ మగినం వెంకట నరసయ్య చిన్న కుమారుడు మగినం రాంబాబు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు.ఆయన మృతి వార్త తెలియగానే దెందుకూరు గ్రామం చేరుకొని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరం శెట్టి కిషోర్ మగినం రాంబాబు పార్థివదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో దెందుకూరు సర్పంచ్ కోట విజయ శాంతి,సొసైటీ చైర్మన్ కోట వెంకటకృష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు,మధిర మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అద్దంకి రవికుమార్,అయితం



ప్రసాద్,గ్రామ శాఖ అధ్యక్షులు వుట్ల రాంబాబు,పమిడి సూరయ్య కృష్ణ ,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ చేయకపోతే

# తెలంగాణ తరహాలో ఉద్యమించి సాధిస్తాం

**– న్యూఢిల్లీలో కవిత నిరసన దీక్షకు నామ సంఘీభావం**
**– రిజర్వేషన్ బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలి**
**– మాటలు కాదు చేతల్లో చేసి చూపించాలి**
**– కవిత నిరసన దీక్షలో కేంద్రంపై బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు మండిపాటు**



**ఖమ్మం, మార్చి 10 (మనం బ్యూరో) :** ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ఈ లోక్ సభ సెషన్ లోనే ప్రవేశపెట్టి, ఆమోదించాలని, లేకుంటే తెలంగాణ తరహాలో పోరాడి మేమే సాధించుకు తీరుతామని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. బిల్లును పార్లమెంట్లో ఆమోదించేంత వరకు కేంద్రాన్ని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టి, ఆమోదించాలనే డిమాండ్ తో శుక్రవారం భారత జాగృతి సంస్థ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కల్వకుంట్ల కవిత చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా నామ దీక్షలో కూర్చుని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ నామ మాట్లాడుతూ సుధీర్ఘకాలంగా మహిళా రిజర్వేషన్ బిల్లు పెండింగ్ లో ఉందన్నారు. బిల్లు పాస్ అయితే చట్ట సభల్లోకి మహిళలు పెద్ద ఎత్తున అడుగు పెట్టి, ప్రజా సమస్యలపై ఎక్కువ స్థాయిలో తమ వాణి వినిపించడానికి అవకాశం ఉంటుందన్నారు. కానీ కేంద్ర సర్కార్ బిల్లు అమోదించకుండా నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తూ కావాలనే కాలయాపన చేస్తుందన్నారు. 16లో లోక్ సభలో ఈ బిల్లు కోసం కేంద్రంపై వత్తిడి తీసుకురావడం జరిగిందని, 17వ లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలమంతా మాట్లాడం జరిగిందని చెప్పారు. పార్లమెంటరీ నాయకులు మీటింగ్ లో కూడా ఈ విషయమై ప్రస్తావించడం జరిగిందని తెలిపారు. కనీసం ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే మహిళా బిల్లును ఆమోదించి, మహిళలకు సపోర్టుగా నిలవాలని, లేకుంటే చరిత్రలో మహిళా వ్యతిరేకులుగా నిలిచిపోతారని నామ పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం మాటలు తప్ప చేతల్లో చేసి చూపించడం లేదని మండిపడ్డారు. అందుకే కవిత తెలంగాణ నుంచి ఢిల్లీ వచ్చి నిరసన దీక్షకు కూర్చోవాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగానైతే రోడ్ల మీదకు వచ్చి పోరాడి సాధించుకున్నామో అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా సాధించుకుంటామని నామ పేర్కొన్నారు. మహిళలంతా సమైఖ్యమై బీజేపీపై పోరాడేందుకు ఇదే మంచి సమయం, అవకాశం అన్నారు. 2014 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లపై బీజేపీ మాట ఇచ్చి తప్పిందని, 2019 ఎన్నికల్లోనూ మళ్ళీ మాట మార్చారని నామ ధ్వజమెత్తారు. రాజ్యసభ ఆమోదించినా కేంద్రం ఎందుకు ఇన్నేళ్లూ బిల్లును పెండింగ్లో పెట్టిందని నామ ప్రశ్నించారు. ప్రపంచాన్ని గమనిస్తే ఆస్ట్రేలియా పార్లమెంట్లో 30 శాతం, సౌతాఫ్రికాలో 42, స్వీడన్ 47, చైనా 25, నేపాల్ 32, యూకే 32 శాతానికి పైగా మహిళా ప్రాతినిధ్యాన్ని కలిగి ఉంటే భారతదేశంలో కేవలం 11 శాతం మంది మహిళలు మాత్రమే చట్ట సభల్లో ప్రాతినిధ్యం ఉందని నామ గుర్తు చేశారు. కవిత చేసే పోరాటానికి అండగా ఉండి, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నామ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ నేత కే.కేశవరావు కూడా పాల్గొని మాట్లాడారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పువ్వాడ



**ఖమ్మం, మార్చి 10 (మనం న్యూస్) :** 16వ డివిజన్ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మేనకోడలు శీలం సుప్రియ – వెంకటేష్ ల నవ వధూవరులను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ , ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దోరేపల్లి శ్వేతా ఆశీర్వదించారు. గురువారం కార్పొరేటర్ నివాసానికి విచ్చేసి శుభా శీస్సులు అందించి,దీవించారు.

## మన ఊరు – మన బడి పనులు పరిశీలించిన మానిటరింగ్ టీమ్ ఏఎంఓ



**దమ్మపేట, మార్చి 10 (మనం న్యూస్) :** ఈరోజు దమ్మపేట మండలం లో జిల్లా విద్యాశాఖ నుండి మానిటరింగ్ టీం ఏ ఎమ్ ఓ నాగరాజ్ శేఖర్ గారు మరియు మన ఊరు మనబడి సెక్టోరియల్ ఆఫీసర్ సురేష్ గారు సందర్శించినారు ఈ సందర్భంగా మన ఊరు మన బడి పనులను ఎంపీపీ ఎస్ జగ్గారం మరియు ఎంపీపీ ఎస్ పాకలగూడెం పాఠశాలల్లో తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేయడమైనది అలాగే ఎంపీపీ ఎస్ బాలరాజు గూడెం ఎంపీపీ ఎస్ దిబ్బగూడెంలో ఎఫ్ ఎల్ ఎన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దమ్మపేట పట్వారిగూడెంలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులకు సలహాలు సూచనలు అందించారు. దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడమైనది ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని శ్రీమతి కే లక్ష్మి గారు మరియు మండల నోడల్ ఆఫీసర్ జగపతి గారు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మస్తాన్ అలి మరియు సి ఆర్ పి లు పాల్గొన్నారు.

# పోడు రైతుల కళ సహకారం చేసిన సీఎం కెసిఆర్

**– పోడు సమస్య పరిష్కారానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ రేగ ప్రత్యేక కృతజ్ఞతలు**
**– ఎంపీపీ గుమ్మడి గాంధీ**



**పినపాక, మార్చి 10 (మనం న్యూస్) :** ఎన్నో ఏళ్ళ నుండి పోడు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు సీఎం కేసీఆర్ పోడుభూమి పట్టాలు మంజూరు చేయడం పట్ల ఎంపీపీ గుమ్మడి గాంధీ హర్షం వ్యక్తం చేశారు.మండల పరిధిలోని ఏడుళ్ళ బయ్యారం ఎక్స్ రోడ్లో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గుమ్మడి గాంధీ అధ్యక్షతన గిరిజన ప్రజాప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా పోడు కొట్టుకొని సాగు చేసుకుంటూ పట్టాల కోసం పోడురైతులకు 2018 ఎన్నికల హామీలో భాగంగా సీఎం కేసీఆర్ పోడు సమస్య ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక కమిటీల ఏర్పాటుచేసి గ్రామసభలలో రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల ఎకరాలకు సంబంధించిన 1,55,393 అర్హులైన పోడు రైతులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు.ఎంపిక చేసిన పోడు రైతులకు ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టాలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 85000 ఎకరాల సంబంధించిన పోడు రైతులకు పట్టాలు మంజూరు అయ్యాయన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న ఇండ్లు లేని పేద కుటుంబాలకు సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం గతంలో డబల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించి అందజేయడం జరిగిందని,ప్రస్తుతం సొంత జాగా ఉండి ఇల్లు లేని పేదల కోసం కొత్తగా గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా 118 నియోజకవర్గలలో నియోజకవర్గనికి 3,000 ఇండ్లు మంజూరు చేస్తూ ఒక్కొక్క ఇంటికి మూడు లక్షల రూపాయలు ఉచితంగా అందజేయడం జరుగుతుంది ఆయన అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు.పోడు రైతులకు పట్టాల మంజూరు చేయడంలో ఎంతో కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు,పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు రేగా కాంతారావుకు మండల గిరిజన ప్రజా ప్రతినిధుల తరపున,తెలంగాణ రాష్ట్ర ఆదివాసి గిరిజన సమాజం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఎంపిటీసీ కాయం శేఖర్,సర్పంచ్ లు గోగ్గాల నాగేశ్వరరావు, కోర్స కృష్ణంరాజు, కాలేటి సునీల్,సోంబోయిన సుధాకర్,మండల ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు తోలెం శ్రీను, గొంది నాగభూషణం,ఇర్ప సాంబ, పాల్గొన్నారు.

## మైనార్టీ సబ్సిడీ రుణ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

**– జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్**



**ఖమ్మం, మార్చి 10 (మనం బ్యూరో) :** మైనార్టీ కార్పొరేషన్ రుణ లబ్ధి దారుల ఎంపికలో జరిగిన అవకతవలపై విచారణ చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. .ఏండ్ల కాలం నుండి ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించలేదని మళ్ళీ ఇన్ని ఏండ్లకి ఇప్పుడు పాత యూనిట్ల తోనే ప్రక్రియ ప్రారంభించిందని దీంతో మైనార్టీ లకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలానే మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు అత్యధిక దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం సక్రమంగా ఇచ్చి ఉంటే మైనార్టీలకు అన్యాయం జరిగి ఉండేది కాదని తెలిపారు. ఏళ్లు దాటినా కూడా అవే పాత యూనిట్లను మంజూరు చేస్తాననడంతో దరఖాస్తుదారులకు న్యాయం జరగదని అన్నారు. పెరిగిన దరఖాస్తులను దృష్టిలో పెట్టుకొని యూనిట్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. 40 యూనిట్లకు 2915 దరఖాస్తులు వస్తే అందర్నీ ఇంటికి పంపించి కొద్ది మంది సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయడం పలు అనుమానాలకు తావిస్తుందని పేర్కొన్నారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పై విచారణ జరిపించి మైనార్టీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ప్రకటన విడుదల చేసిన వారిలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు, ఖమ్మం నియోజక వర్గ పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ ముజహిద్ హుస్సేన్, నగర మైనార్టీ అధ్యక్షులు షేక్ అబ్బాస్ భేగ్, నగర మైనార్టీ నాయకులు షేక్ వసిం, మహముధ్ పాల్గొన్నారు.

## ప్రతినెల ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించాలి : టీఎస్ యుటిఎఫ్ డిమాండ్

**నేలకొండపల్లి, మార్చి 10 (మనం న్యూస్) :** ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించాలని టీఎస్ యుటిఎఫ యుటిఎఫ్ జిల్లా నాయకులు ఆర్ అరవింద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో పదో తారీకు గడుస్తున్న వేతనాలు జమ కాకపోవడం ప్రభుత్వ అసమర్ధత, నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని విమర్శించారు. వేతనాలు సకాలంలో అందకపోవడంతో ఈఎంఐలు చెల్లించాల్సిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెనాల్టీలు చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ రోజుకు కొన్ని జిల్లాల చొప్పున వాయిదాల పద్ధతిలో వేతనాలు చెల్లించటమేంటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు సకాలంలో వేతనాలు పెన్షన్లు ఇతర ఏరియల్ బిల్లులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం తన ఆలోచన ధోరణి మార్చుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఈ కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ మండల నాయకులు టి గురవయ్య, విజయ్ కుమార్, నాగార్జున, నవాబ్ సాహెబ్, కవిత, నాగమణి, కరుణశ్రీ పాల్గొన్నారు.

# విద్యార్థినులకు ధైర్యాన్ని ఇవ్వండి : కలెక్టర్ కె. శశాంక



**మహబూబాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి):** విద్యార్థినులకు ధైర్యాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉందని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు.పట్టణంలోని ధర్మన్న కాలని లో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు గురువారం అస్వస్థతకు లోనవగా అనారోగ్యంగా ఉన్న కొంతమంది విద్యార్థినులను ప్రభుత్వ హాస్పిటల్ లో చేర్పించి చికిత్స అందిస్తుండగా... శుక్రవారం కలెక్టర్ ప్రభుత్వ హాస్పిటల్ ను సందర్శించి విద్యార్థినులకు ధైర్యానిచ్చారు. ఆరోగ్య పరిస్థితులను ప్రతి ఒక్కరినీ స్వయంగా పరామర్శిస్తూ పేరుతెలుసుకుంటు సమస్యను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్స్ అందుబాటులో ఉన్నారని విద్యార్థినులకు ధైర్యం చెప్పారు.అనంతరం పాత్రికేయుల తో కలెక్టర్ మాట్లాడుతూ... అపాయం లేదని వైద్యులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.పరీక్షల సమయం ఆసన్నమైందని ఈ సమయంలో విద్యార్థులకు ధైర్యాన్ని ఇవ్వాలని సూచించారు. విద్యార్థినులు అస్వస్థకు గురికావడం పై విచారణ చేపట్టామని తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.అంతకుముందు కలెక్టర్ ధర్మన్న కాలని లో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యా లయంను సందర్శించి అస్వస్థతకు గురికావడం కు గలా కారణాలను హాస్టల్ అధికారులు సిబ్బందిని అడిగితెలుసుకున్నారు.శానిటేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. వంటగదిని పరిశీలిస్తూ తగు సూచనలు ఇచ్చారు.స్టాక్ రూమ్ ను సందర్శించి స్టాక్ ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, సమస్యలు ఉంటే డాక్టర్ లకు చెప్పాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులతో పైప్ లైన్ పనులు చేపట్టాలన్నారు.కలెక్టర్ వెంట జిల్లా జనరల్ హాస్పిటల్స్ పర్యవేక్షణ అధికారి శ్రీనివాస్, ప్రభుత్వ హాస్పిటల్ పర్యవేక్షణ అధికారి వెంకట రాములు, విద్యాశాఖ అధికారి రామారావు, వైద్య శాఖ అధికారి హరీష్ రాజ్, డాక్టర్ జగదీష్, మునిసిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, డి.ఈ.ఉపేందర్, జెండర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ భవాని ఉప వైద్యాధికారి ఉమాగౌరి తదితరులు ఉన్నారు.

# మహిళలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించుకుని స్వీయ రక్షణ అలవరుచుకోవాలి

## – జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




**మహబూబాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి):** మహిళలలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని స్వీయ రక్షణ అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారంనాడు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హజరై మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థ అనేది ఒక పెద్ద కుటుంభంలాంటిదని అన్నారు. మహిళ సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల ధృష్టికి తీసుకురావాలని కోరారు.మహిళలు ఆత్మ స్థైర్యం తో ఉండి సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ ఏడాది ఎంబ్రస్ ఇక్విటి డిజిటల్ ఇన్నోవేషన్ మరియు టెక్నాలజీ ఫర్ జెండర్ ఇక్వాలిటీ అనే థీమ్ తో విమెన్స్ డే జరుపుకుంటున్నామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల యొక్క సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మరియు రాజకీయ విజయాలకు ప్రతీకగా జరుపుకునే ప్రపంచ దినోత్సవమన్నారు.తల్లిదండ్రులు అబ్బాయిలను, అమ్మాయిలను సమానంగా చూడాలని ఎస్పీ అన్నారు. అమ్మాయిలు ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావలన్నారు. వృత్తిపరంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని, నేర్చుకోవడం అనేది జీవితంలో ఒక నిరంతర ప్రక్రియ కావాలన్నారు. విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలు రంగాల్లో మహిళలు రాణిస్తూ మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. మహబూబాబాద్ జిల్లాలో షీ టీమ్స్ మహిళల భద్రతకు ఏడాది పొడవునా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఒక వ్యక్తిని విద్యా వంతులను చేస్తే కేవలం ఆ వ్యక్తిని మాత్రమే విద్యావంతులను చేస్తారు కాని ఒక స్త్రీని విద్యావంతురాలిని చేస్తే, మొత్తం కుటుంబాన్ని, ఒక తరాన్ని విద్యావంతులను చేస్తుందని అన్నారు. తల్లిగా, చెల్లిగా, అక్కగా, అర్థాంగిగా మహిళ వివిధ పాత్రలను పోషిస్తుందన్నారు. మహిళల అటు ఇంటిని, విధి నిర్వహణను ఏక కాలంలో నిర్వర్తించడం గొప్ప విషయం అన్నారు.అనంతరం సన్మాన కార్యక్రమం నిర్వహించి మహిళ సిబ్బంది అందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మహబూబా బాద్ ఇంఛార్జి డిఎస్పీ రమణ బాబు, షి టీమ్స్,సిసిఎస్ ఇన్స్పెక్టర్ మోహన్, ఏ సూపరింటెండెంట్ రామ దేవి,ఎస్.ఐ లు రమాదేవి,దీపిక రెడ్డి,ఝాన్సి,సిబ్బంది పాల్గొన్నారు

# రైతుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ధర్నా

**తొర్రూరు, మార్చి 10 (మనం న్యూస్) :** తొర్రూర్ లో బిజెపి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా-తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పించడం జరిగింది.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నానిర్వహించి అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి పెదగాని సోమయ్య మాట్లాడుతూ కేసిఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారు అని తెలిపారు.రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ హామీ మరిచి పోయి ఏడేళ్లు పూర్తయింది అయినా కూడా ఇప్పటి వరకూ రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ హామీ అమలు చేయకపోవడం సిగ్గు చేటని తక్షణమే రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇరవై నాలుగు గంటలు కరెంట్ సరఫరా చేస్తామని గొప్పలు చెప్పుకొంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు అని, కరెంట్ సరఫరా నిరాంటంకంగా సరఫరా కాకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తమ పొలాలను అగ్నికి ఆహుతి చేస్తున్న దుస్థితి నెలకొందనిన్నారు. ధరణి పోర్టల్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ నేతృత్వంలో పేదల ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా కార్యదర్శి పరుపాటి రాం మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు పూసాల శ్రీమాన్, ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకులు జలగం వెంకన్న, జిల్లా నాయకులు అన్నం మధుసూదన్ రెడ్డి, ఎస్సీ మోర్చ అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, బీజేపీ కార్యదర్శి జలగం రవి,,బీజేవైఎం అర్బన్ ప్రధాన కార్యదర్శి నూకల నవీన్,ధరావత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మనం మహబూబాబాద్

## సావిత్రి భాయి పూలే ఆశయ సాధనలో ముందుండాలి



**తొర్రూరు, మార్చి 10 (మనం న్యూస్) :** ప్రముఖ సంఘసంస్కర్త, స్త్రీల విద్య తోనే సమాజాభివృద్ధి సాధ్యం అని ఎలుగెత్తి చాటిన మహోన్నత మాతృమూర్తి సావిత్రి భాయి పూలే గారి వర్ధంతి సందర్భంగా ఈరోజు తొర్రూర్ లో బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.స్థానిక తహశీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద ఉన్న సావిత్రి భాయి పూలే గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి పెదగాని సోమయ్య మాట్లాడుతూ భారత దేశం లో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే అని తెలిపారు.స్త్రీల విద్య తోనే సమాజాభివృద్ధి సాధ్యం అని ఎలుగెత్తి చాటి మహిళా పాఠశాల నెలకొల్పి మహిళా విద్య కోసం అహర్నిశలు కృషి చేసిన సావిత్రి భాయి పూలే గొప్ప స్ఫూర్తి ప్రదాత అని తెలిపారు.అంటరానితనం, అస్పృశ్యత పేట్రేగిపోతున్న ఆనాటి కాలంలో సమానత్వం సౌభ్రాతృత్వం కోసం పోరాటం చేసిన యోధుడు జ్యోతి రావు పూలే గారి సతీమణి గా ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వచ్చి సమాజ సేవ లో తనదైన పాత్ర పోషించిన సావిత్రి భాయి పూలే గారి ఆశయ సాధనలో ప్రతీ ఒక్కరూ కంకణబద్ధులై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా కార్యదర్శి పరుపాటి రాం మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు పూసాల శ్రీమాన్, ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకులు జలగం వెంకన్న, జిల్లా నాయకులు అన్నం మధుసూదన్ రెడ్డి, జలగం రవి, మంగళపల్లి యాకయ్య,నూకల నవీన్,ధరావత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సీతక్కను సన్మానించిన మహిళా ఉద్యోగులు



**కొత్తగూడ, మార్చి 10 (మనం న్యూస్) :** మండల కేంద్రంలోని ఎంపీడీపీ ఆఫీస్ లో జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సీతక్క. మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా ఉద్యోగులను శాలువాలతో సన్మానించిన ఎమ్మెల్యే.ఎమ్మెల్యే ని కూడా సన్మానించిన మహిళా ఉద్యోగులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ మహిళలు అని రంగాల్లో రాణించాలని 18 సంవత్సరాలు వచ్చేంత వరకు ఆడపిల్లలపెల్లి చేయకూడదని అన్నారు.

## నిషేధిత ఔషధాలపై అవగాహన



**మరిపెడ, మార్చి 10 (మనం న్యూస్):** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని కనకదుర్గ ఫంక్షన్ హాల్ లో నిర్వహించినటువంటి అవగాహన సదస్సులో మహబూబాబాద్ జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ బి లక్ష్మీ పాల్గొన్నారు. నిషేధిత ఔషధాలు కొనుగోలు మరియు అమ్మకాలను పై కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మెడికల్ షాప్ అసోసియేషన్ బాధ్యులు వి వెంకటేశ్వర్లు కేర్ పాషా అశోక్ మధు గాండ్ల రాజు వంగ నిరంజన్ రెడ్డి మూడు శ్రీ కుమార్ నారాయణ వెంకటేష్ అజ్మీర పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో మహిళాలకు సంరక్షణ



**మరిపెడ, మార్చి 10 (మనం న్యూస్) :** పౌష్టికాహారంతోనే మహిళల కు ఆరోగ్యం సంరక్షణ గా ఉంటుందని , ఆహార నియమాల్లో అధికంగా చిరుధాన్యలు ఉండేలా చూసుకోవాలని, అంగన్వాడీల ద్వారా గర్భిణులు, ఆరెళ్ల వరకు పిల్లల సంరక్షణ ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుంటుందని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు తాళ్లపల్లి రఘు అన్నారు. పౌష్టిక ఆహార వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వారు మరిపెడ మండల ఎల్లంపేట క్లస్టర్ పరిధిలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.తొలుత పసి పిల్లలకు అక్షరాభ్యసం, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా పౌష్టికాహారం తీసుకొని గర్భిణీ మహిళలు ఆరోగ్యవంతంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

**అబ్బాయిపాలెం సెక్టార్లు లో....**

అబ్బాయి పాలెం సెక్టార్ పరిధి అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ జినక మణి ఆధ్వర్యంలో జరిగింది , ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ విజయలక్ష్మి, హెచ్ఎం శారద, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ,అంగన్వాడీ టీచర్లు అబ్బాయిపాలెం జిపి లో ఉన్న తల్లులకు చిరుధాన్యాల మీద అవగాహన కల్పించడం జరిగింది.

**తాళ్ల ఉకల్ లో**

తాళ్ల ఉకల్ సెక్టార్ అంగన్వాడి కేంద్రంలో చిరుధాన్యాల గర్భిణీ మహిళలకు అవగాహన కల్పించారు అనంతరం పలువురు మహిళలకు శ్రీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొంపల్లి సత్యనారాయణ రెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్, అంగన్వాడి టీచర్లు, గర్భిణీ మహిళలు, తదితరులు ఉన్నారు.

## పిచ్చి కుక్క స్వైర విహారం : ఇద్దరికి తీవ్ర గాయాలు



**కొత్తగూడ, మార్చి 10 (మనం న్యూస్) :**మండల కేంద్రంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తూ ఇద్దరిని తీవ్రంగా గాయపరిచింది ఒకరు పొలం పనులకు వెళ్లి వస్తుండగా.మరొకరు కిరాణా షాపులో సామాను కొనుగోలు చేసి వెళుతుండగా . ఇద్దరూ వ్యక్తులను కరిచిన కుక్క తీవ్రంగా గాయపడిన ఇరుప ముత్తయ్య(45), ముూడు సర్వన్(26) గాయపడిన వారిని కొత్తగూడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సంపేట జిల్లా ఆసుపత్రికి తరలింపుఇటీవల కాలంలో విపరీతంగా కుక్కల తో దాడులకు గురవుతున్న బాధితులు మరియు హాస్టల్ సమీపంలో మిగిలిపోయిన అన్నం పడేయడంతో ఆ ప్రదేశాల్లోనే సంచరిస్తున్న కుక్కలుకుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడ ఎస్ ఐ నగేష్ తల్లిదండ్రులకు సూచనలు చేశారు.

## కేజీబీవీని ఆకస్మిక తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి ఖుర్షీద్

**పెద్దవంగర, మార్చి 10 (మనం న్యూస్) :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక అధికారి ఖుర్షద్ ఆకస్మితంగా తనిఖీ చేశారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలోని ఉన్న కేజీబీవీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ వంటశాల పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ గంగారపు స్రవంతికి మరియు సిబ్బందులకు సూచించారు. తర్వాత ఈ సంవత్సరం జరగబోయే పదవ తరగతి విద్యార్థినిలకు సరియైన రీతిలో విద్యాబోధన అందించాలని, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు, పాఠశాల ప్రత్యేక అధికారిని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాల సిబ్బందులు ఉన్నారు.

## బడికి పొమ్మంటే కాటికి వెళ్ళింది

### – తల్లి రోదన

### – కన్నీరు పెట్టుకున్న గ్రామస్తులు



**కొత్తగూడ, మార్చి 10 (మనం న్యూస్) :** ఎన్నో ఆశలతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదుగుతుందనుకున్న తమకూతురు తమకు అండగా ఉంటుందనుకుంటే చదువుకోవాలని చిన్న మందలింపుతో మనస్థాపం చెంది ఇలా చేస్తుందనుకోలేదంటూ కన్న తల్లిదండ్రులు కన్నీరు అవుతున్నారు. వివరాలలోకి వెళితే .. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన జుర్రు రేణుక తొమ్మిదో తరగతి చదువుతుంది. చదువుకోకుండా ఎప్పుడు ఖాళీగా ఉండడంతో తల్లి రేణుకను చదువుకోమంటూ మందలించింది. దీంతో మనస్థాపం చెందిన రేణుక ఈనెల 1వ తేదీన పురుగుల మందు తాగింది, రేణుకను వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి

## లక్ష్య సాధన కొరకు కృషి చేసి అత్యధిక మార్కులు సాధించాలి

### – విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట విశ్వశాంతి విద్యాలయం : ఎంఇఓ పూల్ చంద్




**మహబూబాబాద్, మార్చి 10 (మనం ప్రతినిధి):** కన్న కలలు సార్థకం చేసుకోవాలంటే ఇష్టపడి చదవాలని, లక్ష్యం రూపొందించుకొని అత్యధిక మార్కులు సాధించి పాఠశాలలకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని మండల విద్యాశాఖ అధికారి పూల్ చంద్ గార్ల ఎస్ఐ వెంకన్న సర్పంచ్ బన్సిలాల్ విద్యార్థిని, విద్యార్థులను కోరారు.శుక్రవారంనాడు స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో జరిగిన యానివల్ డే మరియు ఫేర్వెల్ డే కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంఇఓ పూల్ చంద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుందని దాన్ని మార్కుల రూపంలో బహిర్గత పర్చాల్సి ఉంటుందన్నారు. పిల్లలు విద్యలో ముందుంటే తల్లిదండ్రులు ప్రోత్సహిస్తారని తెలిపారు. అలాగే విద్యార్థులు విద్యలో రాణిస్తున్నారంటే ఉపాధ్యాయులు కూడా గర్వంగా ఫీల్ అవుతారని తెలిపారు.అనంతరం గార్ల ఎస్ఐ బానోత్ వెంకన్న మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళిక బద్ధంగా చదివి అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలుగుతారని పేర్కొన్నారు. సర్పంచ్ అజ్మీర బన్సిలాల్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు విశ్వశాంతి విద్యాలయం నిలయమని అన్నారు. విద్యార్థులు అవసరమైన మేరకు చదువుతూ, చదివినవి గుర్తుండి పోయేలా వ్రాసుకోవడం ప్రాక్టీస్ చేసుకుంటే గుర్తుంటాయన్నారు. ఫలితాలు ప్రకటించిన రోజున మార్కులు చూసుకుంటూ ఇంకా బాగా చదివితే బాగుండు అనుకుంటామని గడచిన సమయం తిరిగి రాదన్నారు. ఆలోచించి చదువుపై దృష్టి పెట్టాలన్నారు.ప్రిన్సిపాల్ పసుపులేటి రమేష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో పదవ తరగతి చదివి బయటికెల్లిన విద్యార్థులు నేడు సివిల్స్, ఇంజనీరింగ్, ఎంబిబిఎస్, సాఫ్ట్వేర్ విభాగాలలో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు.1988లో విశ్వశాంతి విద్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని నేటి వరకు 30 పదవ తరగతి బ్యాచ్ లు పాస్ అవుట్ మంచి స్థాయిలో స్థిరపడ్డారని సగర్వంగా చెప్పుకుంటున్నామని అన్నారు. గ్రేడింగ్ విధానం ప్రవేశ పెట్టిన మొదటి సంవత్సరంలోనే 10 కి 10 , 9.8 గ్రేడింగ్ పాయింట్లు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్న ఘనత ఒక్క విశ్వశాంతి విద్యాలయానికే సొంతమని పేర్కొన్నారు. విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదువుకొని పదవ తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని మరో మారు పదవ తరగతి ఫలితాలలో విశ్వశాంతి విద్యాలయం పేరు ప్రఖ్యాతలను రాష్ట్రమంతట మారుమోగేలా కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని ప్రిన్సిపాల్ రమేష్ కోరారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించి నాటికలు నృత్య ప్రదర్శనలు తల్లిదండ్రులను చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఓ పూల్ చంద్, ఎస్ఐ వెంకన్న, సర్పంచ్ బన్సిలాల్ తోపాటు విశ్వశాంతి విద్యాలయం కరస్పట్ పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్,డైరెక్టర్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, బాలరాజు, మునీర్, సుధీర్, సంధ్య, శయనాజ్, రాంబాబు,

# కంటి వెలుగు మహత్తర కార్యక్రమం

### – జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావు




**మరిపెడ, మార్చి 10 (మనం న్యూస్):** కంటి వెలుగు మహత్తర కార్యక్రమం అని, చూపు లోపంతో ఉన్న వారికి రూపాయి ఖర్చు లేకుండా కళ్లజోడు, కంటి ఆపరేషన్ చేయించేలా నిర్వహిస్తున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారని మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావు అన్నారు. శుక్రవారం ఆయన మరిపెడ మండలం బీచ్రాజ్పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జర్పులతండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి వచ్చే వారికి అన్నివిధాల పరీక్షలు నిర్వహించాలని, దగ్గర చూపు, దూరపు చూపు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మెరుగైన చికిత్సల కోసం రిఫర్ చేయాలని సూచించారు. శిబిరంలో తొలి రోజు నమోదు చేసుకున్న వారి సంఖ్య వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటి చూపు కోల్పోయిన వారిని గుర్తించి కంటి వెలుగు ద్వారా చూపును ప్రసాదించే దిశగా బాధ్యతగా వైద్యులు విశిష్ట సేవలు అందించాలన్నారు. కంటి చూపు పరీక్షలకు వచ్చే వారి ఆధార్, ఫోన్ నెంబర్లు విధిగా నమోదు చేయాలని, వెంట తీసుకువచుకునేట్లుగా, కంటి వెలుగు ప్రాధాన్యత గురించి విస్తృత ప్రచారం ప్రజల్లో కల్పించాలని, నమోదు లో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డీపీవో, మరిపెడ ఎంపీడీవో కేలోత్ ధన్సింగ్, మరిపెడ వైద్యాధికారి డా. గుగులోత్ రవినాయక్, సర్పంచ్ కృష్ణ, ఎంపీటీసీ జ్యోతి రామ్మూర్తి, కార్యదర్శి లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలె వర్ధంతి



**గార్ల, మార్చి 10 (మనం న్యూస్) :** కేంద్రంలో స్త్రీల విద్యాభివృద్ధి , హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళ ఉద్యమ కారిణి సావిత్రిబాయి పూలే గ 126 వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి గార్ల సర్పంచ్ బన్సిలాల్ వివిధ సంఘాల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బన్సిలాల్ , బహుజన్ సమాజ్ పార్టీ గార్ల, బయ్యారం మండలాల అధ్యక్షుడు అజ్మీర వెంకన్నలు మాట్లాడుతూ బహుజన వర్గాలకు చదువు నేర్పిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆమె త్యాగం ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోయిందన్నారు. అట్టడుగు వర్గలో విజ్ఞానాన్ని నింపడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి సావిత్రిబాయి పూలే అని ఆమె చేసినటువంటి కృషి నేటితరం మహిళలకు ఎంతో ఆదర్శవంతమని అన్నారు స్థానిక గార్ల ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ గార్ల, బయ్యారం మండలాల అధ్యక్షుడు వెంకన్న, ముల్కనూర్ సెక్టార్ అధ్యక్షుడు వాగ్యా జీవన్, సంతోష్, గణేష్ ,నవీన్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## భారత్ బచావో సెమినార్కు ఎల్హెచ్పిఎస్ నాయకులు



**మహబూబాబాద్ టౌన్, మార్చి 10 (మనం న్యూస్) :** ఈ రోజు న్యూ ఢిల్లీ లో నీ భారత్ బచావో జాతీయ స్థాయి సెమినార్ సందర్భంగా ఉమాడి వరంగల్ జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్హెచ్పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమా నాయక్, వాసు నాయక్ రాష్ట్ర కార్యదర్శి,మహబూబాబాద్ పార్లిమెంట్ ఇంఛార్జి వినోద్ నాయక్, ఎల్ఎస్ఓ జిల్లా అధ్యక్షులు శివవర్మ నాయక్,గూడూరు మండల అధ్యక్షులు బనోత్ చందు నాయక్ ఢిల్లీ లో నీ ఎర్రకోట, ఇండియా గేట్, ఇండియా సుప్రీంకోర్టు అదే విధంగా వివిధ ముఖ్యమైన ప్రదేశాలు సందర్శించడం జరిగింది.